

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:101 | ఎడిటర్: మేనం శ్యామ్ | ఆదివారం 01-11-2026 | పేజీలు: 10

సిరా చుక్క

నిన్ను నువ్వు నమ్ముకో..
నీ గెలుపును ఖాయం చేసుకో!
సమాజంలో నిన్ను ఎవరు
తక్కువ అంచనా వేసినా..
నీపై నీకు ఉన్ననమ్మకాన్ని కోల్పోవద్దు.
ఇతరుల విమర్శలు, నెగెటివ్ మాటలను
నీ మనసులోకి రానిచ్చి
ఒత్తిడి పెంచుకోవద్దు.
లోకం నిన్ను చూసి నవ్వినా..
నీ పట్టుదలను మాత్రం
ఎక్కడా వదిలిపెట్టకు.
నీ జీవితానికి, నీ విజయానికి
నీ ఆలోచనలే తప్ప
వేరే ఎవ్వరూ బాధ్యులు కారు
.నిన్నటి ఓటమిని మర్చిపో..
నేటి కొత్త రోజు అనే
సరికొత్త అవకాశాన్ని అందిపుచ్చుకో.
కష్టాలు అనేవి
నిన్ను పడగొట్టడానికి కావు..
నీలోని అసలైన శక్తిని
నిలిపేందుకే వస్తాయి
నీ మనసును ప్రశాంతంగా
ఉంచుకున్నప్పుడే..
ఎలాంటి సమస్యనైనా
సులువుగా జయించ గలవు.
నీ ఆలోచనావిధానాన్ని మార్చుకో..
నీ చుట్టూ ఉన్న ప్రపంచం
దానంతట అదే మారుతుంది!...

యాకన్న గాడి పెళ్లి. ,
ప్రజా వాయిస్
జనగామ జిల్లా బ్యూరో

నక్సల్స్ ఖతం..
ఇక అర్బన్ నక్సల్స్ వంతు.!



- నక్సలిజం అంతమైంది.. పట్టణాల్లో కుట్రలకు పాల్పడే శక్తులపైనా గురి
- అడవుల్లో తుపాకుల మోతకు తెర
- అర్బన్ నక్సలిజాన్నీ అంతం చేస్తాం
- దేశాన్ని అస్థిరపరిచే 'దిమాగీ నక్సల్స్' మరింత ప్రమాదకరం
- ఆందోళనలు, ధర్నాల ముసుగులో కుట్రలను బద్దలు కొట్టాలి
- 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యం
- జాతీయ ఐక్యతా దినోత్సవంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

ప్రజా వాయిస్, డెస్క్ ఏక్తానగర్: దేశంలో నక్సలిజం అంతమైందని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఇక అర్బన్ నక్సలిజంపైనా దృష్టి సారించారు. అడవుల్లో సాయుధ హింసకు అడ్డుకట్ట వేశామని, పట్టణాల్లో ఉంటూ దేశాన్ని అస్థిరపరిచే కుట్రలకు పాల్పడే శక్తులను కూడా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో ప్రధాని చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అడవుల్లో అంతం.. పట్టణాలపై గురి

నక్సలైట్ల హింస నుంచి దేశానికి విముక్తి కల్పించామని మోదీ పేర్కొన్నారు. ఒకప్పుడు నక్సల్స్ ప్రభావంతో అభివృద్ధికి దూరమైన గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలు ఇప్పుడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని చెప్పారు. రహదారులు, టెలికాం సేవలు విస్తరిస్తున్నాయని వివరించారు. అయితే సాయుధ నక్సలిజంతోనే ముప్పు ముగిసిపోలేదని, దేశాన్ని అస్థిరపరిచే 'దిమాగీ నక్సల్స్' కుట్రలు మరింత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.

కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి

ఆందోళనలు, ధర్నాల ముసుగులో దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలను బద్దలు కొట్టాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ఐక్యతకు విఘాతం కలిగించే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటే దేశ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

పేదరికం తగ్గింది.. ఆరోగ్య భరోసా

భారత్‌లో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొన్నట్లు మోదీ తెలిపారు. 2014 నుంచి నిరుపేదల సంఖ్య క్రమంగా తగ్గుతోందన్నారు. దేశంలో 100 కోట్ల మందికి ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని వివరించారు. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' నినాదంతో సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యమని పునరుద్ఘాటించారు.

దేశ ప్రజలను విభజించే కుట్ర

రాజకీయ నిరాశతో ప్రతిపక్షాలు దేశ ప్రగతిని అడ్డుకునేందుకు యత్నిస్తున్నాయని ప్రధాని మోదీ ఫైరయ్యారు. 'దేశ ప్రజలను విభజించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విదేశాల్లో భారత్ వ్యతిరేక శక్తులతో రహస్యంగా ఎవరు సమావేశమవుతున్నారు దేశ వ్యతిరేకుల తరహాలో ఎవరు మాట్లాడుతున్నారు ఇలాంటి వారిని ఎదుర్కొనేందుకు అందరం ఐక్యంగా ఉండాలి' అని గుజరాత్‌లో నిర్వహించిన ఏక్తా దివస్‌లో పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లో ఆగని అండాల దందా.!

- పేదరికమే పెట్టుబడి.. యువతులే టార్గెట్.!
- సరూర్‌నగర్‌లో మరో ముఠా గుట్టురట్టు
- ఒకే ఇంట్లో 18 మంది యువతులు.. ఇంజెక్షన్లతో అండాల సేకరణ
- బేగంపేట ఘటన మరువకముందే మరో అక్రమ వ్యవహారం వెలుగులోకి
- ఐవీఎఫ్ కేంద్రాలకు అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు అనుమానాలు
- ముఠా వెనుక ఉన్న అదృశ్య శక్తులపై పోలీసుల ఆరా

2లో

రైతుబంధుకు ఎల్‌నినో ఎసరు.!

- సాగు వద్దంటూ సర్కారు సంకేతాలు
- పెట్టుబడి సాయం ఎగ్గొట్టేందుకు రంగం సిద్ధం.?
- జులై వరకు పంటలు వేయొద్దంటూ ప్రకటన
- సాగునీరు, కరెంటు ఇవ్వలేమని చేతులెత్తేసిన సర్కారు
- సాగు చేస్తే మాదే బాధ్యత కాదంటూ రైతులతో సెల్ఫ్ డిక్లరేషన్
- మూడేళ్లలో రెండుసార్లే రైతుబంధు..నాలుగు విడతలకు కోత
- ఎల్‌నినో సాకుతో మరో రెండు విడతలకు ఎగనామం.?
- రైతుబీమా బంధు.. ఇక రైతుబంధుకూ మంగళం పాడే యోచన

2లో

ముగ్గురు ఘనుల స్ఫూర్తికి సీఎం రేవంత్ వందనం.!

- శక్తిస్థల్‌లో ఇందిరాగాంధీకి పుష్పాంజలి.. సేవలు చిరస్మరణీయం
- దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి ఇందిరమ్మ విశేష కృషి
- వందలాది సంస్థానాల విలీనంతో అఖండ భారత నిర్మాణం
- ఉక్కుమనిషి సర్దార్ పటేల్ స్ఫూర్తి దేశానికి మార్గదర్శకం
- జాతీయ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు సీఎం పిలుపు
- అంతరిక్షంలో భారత్ మరో ముందడుగు.. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు



2లో

రాజీనామాలకు రెడీ.. దమ్ముంటే సర్కారు రద్దు చేయండి.!

- రేవంత్‌కు బండి సంజయ్ సవాల్
- బ్యాలెట్ ఎన్నికలకు రావాలని డిమాండ్
- బీజేపీ ఎంపీల రాజీనామాలకు సిద్ధం
- 8 మంది ఎంపీలతో రాజీనామా చేయిస్తా
- ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్
- రాజకీయ స్వార్థమే పరమావధి
- అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా మారని కాంగ్రెస్ తీరు
- సీఎం రేవంత్ ప్రభుత్వానికి కేంద్రమంత్రి బహిరంగ సవాల్
- ప్రజా సమస్యలపై పోరాటం.. రాజకీయ సమరానికి సిద్ధం

2లో

ఓట్ల దొంగలెవరు.? మోదీ సర్కారుపై రాహుల్ ఫైర్.!

- ఎన్నికల సంఘం అండతోనే ఓట్ చోరీ.. రాహుల్ సంచలన ఆరోపణలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రజా అభిశంసన అస్త్రం
- ఖర్గే నివాసంలో ఇండియా కూటమి మాక్ పార్లమెంట్
- 2024 ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు
- సీఈసీని కాపాడితే బీజేపీ బండారం బయటపెడతాం



ప్రజా వాయిస్,న్యూఢిల్లీ: ఓట్ల లెక్కల్లోనే కాదు.. ఓటర్ల జాబితాల్లోనూ అక్రమాలు జరుగుతున్నాయా, ప్రజాస్వామ్యానికి పునాదైన ఓటు హక్కుపైనే కుట్ర జరుగుతోందా, దేశ రాజకీయాల్లో ఇప్పుడు ఇదే అంశం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఓట్ చోరీకి ప్రధాని మోదీ ప్రభుత్వమే కారణమంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలకు పాల్పడుతున్నాయని ఆయన మండిపడ్డారు.

సీఈసీపై ప్రజా అభిశంసన అస్త్రం

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌తో ఇండియా కూటమి శనివారం ఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో మాక్ పార్లమెంట్ నిర్వహించింది. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖర్గే ప్రజా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పార్లమెంట్‌లో సీఈసీ తొలగింపు ప్రక్రియకు ప్రభుత్వం అడ్డుపడుతోందని,

మిగతా 2లో

ఉద్యోగులకు ఐదు రోజులే పని.!

- వారానికి రెండు రోజులు సెలవులు ఇవ్వాలని జేఏసీ వినతి
- తెలంగాణ ఉద్యోగులకు వీకెండ్ సెలవుల ప్రతిపాదన
- కేంద్ర ప్రభుత్వ తరహాలో రాష్ట్రంలోనూ ఐదు రోజుల పని విధానం
- సీఎస్ సంజయ్ జాజుకు ఉద్యోగ సంఘాల జేఏసీ వినతి-
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 వరకు విధులు నిర్వహించాలని సూచన
- విద్యుత్, నీరు, ఇంధనం ఆదా.. కాలుష్యానికీ కళ్లెం
- పని ఒత్తిడి తగ్గి ఉద్యోగుల సామర్థ్యం పెరుగుతుందని వెల్లడి

2లో

తుమ్మిడిహెట్టికి కొత్త కళ.!

- మహారాష్ట్ర అభ్యంతరాలపై తెలంగాణ గురి.. అలైన్‌మెంట్ల మార్పులకు కసరత్తు
- 148 నుంచి 152 మీటర్లకు జలమట్టం పెంపునకు ప్రతిపాదన
- ముంపు సమస్యలపై సమగ్ర సాంకేతిక అధ్యయనం
- 77 టీఎంసీల నీటి మళ్లింపే లక్ష్యం
- ఏడు జిల్లాల్లో 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు
- పరిష్కార మార్గాల అన్వేషణలో మంత్రి ఉత్తమ్



ప్రజా వాయిస్,హైదరాబాద్: తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. మహారాష్ట్ర అభ్యంతరాలు.. ముంపు సమస్యలు.. పర్యావరణ పరిమితులకు పరిష్కారం చూపుతూ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బ్యారేజీ అలైన్‌మెంట్లు, సాంకేతిక అంశాలపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర లేవనెత్తిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సాంకేతికంగా పటిష్టమైన, ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను రూపొందించాలని ఆదేశించారు.

నాలుగు మీటర్ల పెంపుతో భారీ మార్పు

ప్రస్తుతం 148 మీటర్లుగా ఉన్న పూర్తి జలాశయ మట్టాన్ని (ఎఫ్ఆర్ఎల్)

మిగతా 2లో

ముగ్గురు ఘనుల స్ఫూర్తికి సీఎం రేవంత్ వందనం.!

ప్రజా వాయిస్,హైదరాబాద్: దేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ఇద్దరు మహనీయుల సేవలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం, అభివృద్ధికి వారు చేసిన కృషిని కొనియాడారు. మరోవైపు అంతరిక్ష రంగంలో భారత్ సత్తా చాటిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం

ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని శక్తిస్థల్ వద్ద రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం, ఆర్థికాభివృద్ధి, పేదల సంక్షేమానికి ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లు, ఒడిదుడుకులు ఎదురైనా దేశ ప్రయోజనాలే లక్ష్యంగా సాగిన ఆమె ప్రస్థానం భారత రాజకీయ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని కొనియాడారు.

అఖండ భారతానికి పటేల్ పునాది

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతోపాటు వందలాది సంస్థానాలను ఏకతాటిపైకి తెచ్చి అఖండ భారత నిర్మాణానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఉక్కు సంకల్పం, దృఢ నాయకత్వానికి పటేల్ ప్రతీకగా నిలిచారని కొనియాడారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి



ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

అంతరిక్షంలో ఇస్రో మరో విజయం

జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి సీఎం అభినందనలు తెలిపారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం దేశ నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే కీలక మైలురాయి అని పేర్కొన్నారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్, పర్యవేక్షణ, అత్యవసర సేవలకు ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఏపీకి తెలంగాణ 'పవర్' అండ.!

- **తుఫాన్ బీభత్సంతో కుప్పకూలిన విద్యుత్ వ్యవస్థకు భట్టి భరోసా**
- **ఏపీ మంత్రి గొట్టిపాటికి ఫోన్.. పునరుద్ధరణ పనులపై ఆరా**
- **అవసరమైతే అదనపు సిబ్బంది, సామగ్రి పంపేందుకు సిద్ధం**
- **రంగంలోకి 5,500 మంది విద్యుత్ సిబ్బంది.. రేయింబవళ్లు శ్రమ**
- **నీట మునిగిన పొలాలు, చేపల చెరువుల్లోనూ మరమ్మతుల ముమ్మరం**



ప్రజా వాయిస్,హైదరాబాద్: తుఫాన్ బీభత్సంతో అంధకారంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ అండగా నిలిచింది. ప్రకృతి విపత్తు సృష్టించిన విధ్వంసంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను తిరిగి వెలిగించేందుకు తెలంగాణ ప్రభుత్వం సహాయ హస్తం అందిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసి విద్యుత్ పునరుద్ధరణ పనుల పురోగతిపై ఆరా తీశారు.తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు. సిబ్బంది, సామగ్రి కొరత ఏమైనా ఉందా? అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ వ్యవస్థను సాధ్యమైనంత త్వరగా సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. అవసరమైన సిబ్బంది, సామగ్రి కావాలంటే వెంటనే తెలియజేయాలని సూచించారు.

రెండు రాష్ట్రాల సిబ్బంది సమష్టి పోరు

తుఫాన్ విధ్వంసం తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రెండు రాష్ట్రాల విద్యుత్ సిబ్బంది శ్రమిస్తున్నారు. తెలంగాణకు చెందిన 1,100 మందికి పైగా ఉద్యోగులు క్షేత్రస్థాయిలో సేవలందిస్తుండగా.. ఏపీ డిస్కంలకు చెందిన 4,400 మంది సిబ్బంది నిరంతరం విధుల్లో నిమగ్నమయ్యారు. పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నారు.

ప్రాణాలకు తెగించి.. విద్యుత్ వెలుగుల కోసం.!

తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన పరిపొలాలు.. లోతైన చేపల చెరువులు.. అయినా విద్యుత్ ఉద్యోగుల వెనుకడుగు లేదు. నరసాపురం డివిజన్ పాలకొల్లు సెక్షన్ పరిధిలోని అదర్శపాలెంలో 11 కేవీ విద్యుత్ లైన్ల పునర్నిర్మాణం చేపట్టారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ సిబ్బంది మరమ్మతులు కొనసాగిస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి సర్కిల్, హిందూపురం డివిజన్‌కు చెందిన లైన్‌మెన్లు సైతం పునరుద్ధరణ పనుల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. మదకశిర సబ్ డివిజన్ అగళి సెక్షన్ పరిధిలో అధికారుల పర్యవేక్షణలో పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి.

సరిహద్దులు దాటి సహకారం.. సంక్షోభంలో సమన్వయం.!

ప్రకృతి విపత్తు వేళ రాష్ట్రాల మధ్య సహకారానికి ఈ చర్యలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఏపీ విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన గాడిలో పెట్టేందుకు తెలంగాణ సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. చీకటిని తరిమి ప్రజల ఇళ్లలో మళ్లీ వెలుగులు నింపడమే లక్ష్యంగా విద్యుత్ యంత్రాంగం సమష్టిగా కదులుతోంది.

తుమ్మిడిహెట్టికి కొత్త కళ.!

మొదటి పేజీ తరువాయి

152 మీటర్లకు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. ఈ ప్రతిపాదన అమలైతే నీటి నిల్వ సామర్థ్యం 2.182 టీఎంసీల నుంచి 5.697 టీఎంసీలకు పెరగనుంది. అంటే అదనంగా 3.515 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. అక్టోబర్ 26న ముంబైలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మధ్య జరిగిన సమావేశంలోనూ ఈ అంశంపై చర్చించారు.

ముంపు చిక్కులకు సాంకేతిక పరిష్కారం

బ్యారేజీ నిర్మాణంలో మహారాష్ట్ర అభ్యంతరాలకు ప్రధాన కారణమైన ముంపు సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వివిధ జలాశయ నీటిమట్టాల వద్ద ప్రభావితమయ్యే భూముల వివరాలను సమగ్రంగా సేకరించాలని మంత్రి ఆదేశించారు. అటవీ భూములు, నదీ గర్భ ప్రాంతాలు, పర్యావరణ సున్నిత ప్రాంతాలు, నివాస ప్రాంతాలను గుర్తిస్తూ ప్రత్యేక మ్యాపులు రూపొందించాలని సూచించారు. అవసరమైన సాంకేతిక మార్పులను పరిశీలించి, ముంపు ప్రభావాన్ని తగ్గించే మార్గాలను అన్వేషించాలని స్పష్టం చేశారు.

77 టీఎంసీలు.. 5.85 లక్షల ఎకరాలు

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ద్వారా 77 టీఎంసీల నీటిని మళ్లించి ఏడు జిల్లాల్లో 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుతో అనుసంధానిత వ్యవస్థ ద్వారా సాగునీటి ప్రయోజనాలు కల్పించనున్నారు. ప్రతిపాదిత 152 మీటర్ల జలమట్టం వద్ద కూడా ముంపు ప్రభావం పరిమితంగానే ఉంటుందని ప్రాజెక్టు అంచనాలు పేర్కొంటున్నాయి. అయితే ఇరు రాష్ట్రాల్లో భూముల ముంపు, పునరావాసం, పునఃస్థాపన అంశాలపై సమగ్ర పరిశీలన అవసరమని అధికారులు భావిస్తున్నారు.

రైతుల ఆశలు.. ప్రాజెక్టుపై కొత్త ఆశలు

సాగునీటి అవసరాలు, పర్యావరణ పరిరక్షణ, అంతరాష్ట్ర సమన్వయం.. ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. మహారాష్ట్ర అభ్యంతరాలకు పరిష్కారం లభించి, ప్రతిపాదిత మార్పులకు ఆమోదం లభిస్తే ప్రాజెక్టు పురోగతికి మార్గం సుగమం కానుంది. తాజా సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజనీర్-ఇన్-చీఫ్ ఓ.వి. రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఐదు రోజులే పని.!


ప్రజా వాయిస్,హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో ఐదు రోజులే విధులు.. మిగిలిన రెండు రోజులు విశ్రాంతి రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ కేంద్ర ప్రభుత్వ తరహాలో ఐదు రోజుల పనిదినాల విధానం అమలు చేయాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఉద్యోగుల పని ఒత్తిడి తగ్గించడంతో పాటు ప్రభుత్వ ఖర్చులకు కోత పెట్టేలా ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు వినతిపత్రం అందజేసింది.

పనివేళల్లో మార్పులు.. కొత్త ప్రతిపాదనలు

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తున్నాయి. వీటిని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మార్చాలని జేఏసీ ప్రతిపాదించింది. రోజుకు 7.30 గంటల చొప్పున విధులు నిర్వహిస్తే వారానికి 37.5 గంటల పని సమయం పూర్తవుతుందని వివరించింది. రెండో శనివారం సెలవును కూడా పరిగణనలోకి తీసుకుని ఈ విధానాన్ని అమలు చేయవచ్చని సూచించింది.

ఖర్చులకు కళ్లెం.. ఉద్యోగులకు ఊరట

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీరు, విద్యుత్, ఇంధన కొరత ఏర్పడే అవకాశాలున్నాయని జేఏసీ పేర్కొంది. వారానికి ఐదు రోజుల పనివిధానం అమలైతే ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్, నీటి వినియోగం తగ్గుతుందని తెలిపింది. కార్యాలయాలకు రాకపోకలు తగ్గడంతో ఇంధనం ఆదా కావడంతో పాటు వాహనాల రద్దీ, వాయు కాలుష్యం కూడా తగ్గుతాయని వివరించింది.



JOINT ACTION COMMITTEE OF TELANGANA EMPLOYEES, GAZETTED OFFICERS, TEACHERS, WORKERS & PENSIONERS, HYDERABAD.

Office : H. No. 5-5-404/4, Telangana Bhavan, M.J. Road, Beside Gandhi Bhavan, Nampally, Hyderabad - 500001

Chairman MARAM JAGADEESWAR President TNGOs' Central Union Cell: 9866277771 e-mail: tngosnews@gmail.com

Secretary General ELURI SREENIVASA RAO President TGOs' Central Association Cell: 99857 02488 e-mail: tgosnews@gmail.com www.tgos.co.in

Lr.No.2910/TGEJAC/2026 - Dated: 29-10-2026

To
The Chief Secretary to Government,
& Chairman, JSC
Government of Telangana
TG-Secretariat-Hyderabad.

Respected Sir,

Sub: Joint Action Committee of Telangana Employees, Gazetted Officers, Teachers, Workers & Pensioners, Hyderabad – Request to implement five (5) working days a week in view of "EL NINO" Phenomenon in the in the State of Telangana – Reg.

Ref: Lr.No.2910/TGEJAC/2026; Dated: 29-10-2026

We submit the following lines for your kind consideration and necessary orders at the earliest.

We bring to your kind notice that earlier number of times we have requested the Government to implement the (5) working days a week on par with Central Government Departments / Institutions, so as to save the Water, power, and reduction of the vehicle pollution in view of "EL NINO" Phenomenon and enhance the efficiency of the employees.

రెండు రోజుల విశ్రాంతితో మెరుగైన పనితీరు

వారానికి రెండు రోజులు విశ్రాంతి లభిస్తే ఉద్యోగుల్లో పని ఒత్తిడి తగ్గి ఉత్సాహం, పనితీరు, సామర్థ్యం పెరుగుతాయని జేఏసీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ విధానం వల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకపోగా, వివిధ రూపాల్లో నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సీఎస్‌కు అందజేశారు. ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా ఐదు రోజుల పనిదినాల విధానం అమలుకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

ఓట్ల దొంగలెవరు.? మోదీ సర్కారుపై రాహుల్ ఫైర్.!

మొదటి పేజీ తరువాయి

అందుకే ప్రజాక్షేత్రంలో అభిశంసన చేపట్టాల్సి వచ్చిందని కూటమి నేతలు పేర్కొన్నారు.

మూడు శాతం ఓట్ల తేడా.. 15 శాతం ఓట్లు తొలగింపు.?

2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఓట్ల తేడా కేవలం మూడు శాతమేనని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. గత ఎన్నికల్లో ఓటు వేసిన వారిలో 15 శాతం మంది ఓట్లను తొలగించారంటూ ఆరోపించారు. బీజేపీ ఎంపీలు అక్రమంగా లోక్‌సభలోకి ప్రవేశించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఆరోపణలు ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై కొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి.

ఎన్నికల సంఘంపై నేరుగా గురి

ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తమ వద్ద ఆధారాలున్నాయని ప్రకటించారు. ఆయనను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తే ఆ పార్టీ వైఖరి బయటపడుతుందని హెచ్చరించారు.

ప్రజా అభిశంసన.. రాజకీయ పోరాటానికి కొత్త వేదిక

సీఈసీపై పార్లమెంటరీ మార్గంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న ఇండియా కూటమి.. మాక్ పార్లమెంట్‌తో తమ నిరసనను మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రజా అభిశంసనను రాజకీయ ఆయుధంగా అభివర్ణించిన రాహుల్.. ఓటు హక్కు పరిరక్షణే తమ పోరాటమని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, ఓటర్ల జాబితాల పారదర్శకతపై అధికార, ప్రతిపక్షాల మధ్య ఈ వివాదం మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి.



హైదరాబాద్‌లో ఆగని అండాల దందా.!

ప్రజా వాయిస్,హైదరాబాద్: నగరంలో అక్రమ అండాల సేకరణ దందా యథేచ్ఛగా సాగుతోందా, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని యువతుల శరీరాలతో వ్యాపారం చేస్తున్నారా, బేగంపేట ఘటన మరువకముందే సరూర్‌నగర్‌లో వెలుగుచూసిన మరో ఉదంతం ఈ ప్రశ్నలను లేవనెత్తుతోంది. కాలేజీ విద్యార్థినులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద యువతులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అండాల సేకరణ వ్యవహారాన్ని పోలీసులు గుర్తించారు.

ఒకే ఇంట్లో 18 మంది యువతులు

సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో అక్రమ అండాల సేకరణ జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్కడ ఉన్న 18 మంది యువతులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపి యువతులను ఈ వ్యవహారంలోకి లాగుతున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఇంజెక్షన్లు ఇచ్చి అండాలను సేకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

ఐవీఎఫ్ కేంద్రాలకు అక్రమ సరఫరా.?

సేకరించిన అండాలను నగరంలోని కొన్ని ప్రముఖ ఐవీఎఫ్ కేంద్రాలకు అనధికారికంగా సరఫరా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో మధ్యవర్తుల పాత్ర ఎంత అండాల సేకరణ



వెనుక ఉన్న అసలు నిర్వాహకులెవరు? ఏయే కేంద్రాలకు వీటిని తరలిస్తున్నారు? అన్న అంశాలపై పోలీసులు దృష్టి సారించారు.

హాస్టల్లే అడ్డాలుగా.. యువతులే బాధితులుగా.!

ఇటీవల బేగంపేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లోని గర్ల్స్ హాస్టళ్లపై పోలీసులు దాడులు నిర్వహించి అక్రమ అండాల సేకరణ వ్యవహారాలను వెలికితీశారు. బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి యువతులను నగరానికి రప్పించి ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. వరుసగా వెలుగుచూస్తున్న ఘటనలు నగరంలో ఈ అక్రమ వ్యాపారం విస్తృతిపై ఆందోళన కలిగిస్తున్నాయి. యువతుల ఆరోగ్యం, భద్రతను పణంగా పెట్టి సాగుతున్న ఈ వ్యవహారంలో అసలు నెట్‌వర్క్‌ను ఛేదించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రాజీనామాలకు రెడీ.. దమ్ముంటే సర్కారు రద్దు చేయండి.!

ప్రజా వాయిస్, హైదరాబాద్:ప్రజలు సమస్యలతో అల్లాడుతుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసిందని కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా కాంగ్రెస్ తీరు మారడం లేదని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని, రాజకీయ స్వార్థంతో వ్యవహరిస్తోందని విమర్శించారు.

రేవంత్‌కు రణసవాల్.!

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ సంచలన సవాల్ విసిరారు. తెలంగాణలో బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలకు వెళ్లేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా దమ్ముంటే ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు.

8 మంది ఎంపీల రాజీనామాలకు సిద్ధం

అవసరమైతే బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలమంతా రాజీనామాలకు సిద్ధమని బండి సంజయ్ ప్రకటించారు. ఇందుకోసం పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించే బాధ్యత తానే తీసుకుంటానని స్పష్టం చేశారు.

సీఎం సిద్ధమా..?

మా ఎంపీల రాజీనామాలకు మేం సిద్ధం.. మీ ప్రభుత్వాన్ని రద్దు చేసి బ్యాలెట్ ఎన్నికలకు రావడానికి మీరు సిద్ధమా?" అంటూ రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ సూటిగా సవాల్ విసిరారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించకుండా రాజకీయ స్వార్థంతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ తీరుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు.





రైతుబంధుకు ఎల్‌నినో ఎసరు.!

ప్రజా వాయిస్, హైదరాబాద్:రైతుబంధుకు ఎల్‌నినో ఎసరు పెట్టనుందా? సాగు చేయొద్దంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు రైతుల పెట్టుబడి సాయానికి గండికొట్టనున్నాయా జులై వరకు పంటలు సాగు చేయవద్దని సూచించిన సర్కారు.. వచ్చే ఏడాది సాగునీరు, విద్యుత్ సరఫరా చేయలేమంటూ చేతులెత్తేసింది. సాగు చేస్తే ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదంటూ రైతులతో సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకునే పరిస్థితి నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో వచ్చే ఏడాది రైతుబంధు నిధుల విడుదలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

సాగు వద్దు.. సాయం కూడా వద్దా.?

ఎల్‌నినో ప్రభావంతో వచ్చే ఏడాది చివరి వరకు క్రాప్ హాలిడే పరిస్థితులు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నట్లు సమాచారం. దీంతో సాగు చేయని రైతులకు రైతుబంధు ఇవ్వాల్సిన అవసరం లేదనే భావనలో ప్రభుత్వం ఉన్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాగు వద్దని చెప్పడం ద్వారా రైతుబంధు నిధుల విడుదలకు కూడా ప్రభుత్వం సాకులు వెతుకుతోందనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

నాలుగు విడతలు ఎగవేత.. మరో రెండింటికీ కోత.?

మూడేళ్ల పాలనలో రైతుబంధు నిధులు రెండుసార్లు మాత్రమే విడుదల చేశారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే నాలుగు విడతల నిధులు ఎగ్గొట్టిన ప్రభుత్వం.. తాజాగా ఎల్‌నినో, కరువు పరిస్థితుల పేరుతో మరో రెండు విడతలకు కోత పెట్టేందుకు సిద్ధమవుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలోనే రైతుబంధు గుర్తుకొస్తోందని, మిగతా సమయాల్లో రైతులను పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రభుత్వంపై ఉన్నాయి.

రైతుబీమాకు మంగళం.. రైతుబంధుకూ బ్రేక్.?

రైతుల సంక్షేమానికి కీలకమైన రైతుబీమా పథకానికి ఇప్పటికే మంగళం పాడిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతుబంధును కూడా నిలిపివేసే దిశగా అడుగులు వేస్తోందనే చర్చ సాగుతోంది. ఎల్‌నినో ప్రభావంతో సాగు చేయలేని పరిస్థితులు వస్తే రైతులకు పెట్టుబడి సాయం ఎలా అందిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాగు వద్దని చెప్పే ప్రభుత్వం.. రైతుల ఆర్థిక భద్రతకు ఏం చర్యలు తీసుకుంటుందో స్పష్టం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎన్నికలప్పుడే రైతుబంధు.. మిగతా వేళల్లో మొండిచేయి.?

సాగు చేయొద్దంటూ ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం.. రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయంపై మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. ఎల్‌నినోను సాకుగా చూపి రైతుబంధు పథకాన్ని క్రమంగా పక్కన పెట్టే ప్రయత్నం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాగు చేయలేని పరిస్థితుల్లో రైతులకు ప్రత్యామ్నాయ ఆర్థిక సాయం అందిస్తారా, రైతుబంధు కొనసాగిస్తారా అన్నది ప్రభుత్వం తేల్చాల్సి ఉంది.



ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

- గడువులోగా భూముల రీ సర్వే పూర్తి చేసేలా ప్రణాళికలు అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు, భూముల రీ సర్వే, ఇతర రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జరిమానాలు విధించి, వాహనాలు జప్తు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకూడదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు కేవలం టిజిఎండిసి లేదా మన ఇసుక వాహనం యాప్ ద్వారా మాత్రమే ఇసుక పొందాలని తెలిపారు. భూముల రీ సర్వే వివరాలను మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో 19 మండలాలకు 21 సర్వే పరికరాలు (రోవర్లు) ఉన్నాయని, స్పష్టమైన ప్రణాళికలతో గడువులోగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాకు మరిన్ని సర్వే యంత్రాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రతి సర్వే సిబ్బందికి టోపీ, తాగునీరు, ఓఆర్ఎస్ పొట్లాలతో కూడిన కిట్ లను అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, ఖైరసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల సేవల్లో 'టాప్'.. వసతుల కరువులో 'ఫ్లాప్'

- ముథోల్ దవాఖానాపై 'ప్రజా వాయిస్' డీప్ ఇన్వెస్టిగేటివ్ రిపోర్ట్!
- సేవల్లో రికార్డు.. వసతుల్లో నరకం
- ఐదు దశాబ్దాల ముథోల్ ఆసుపత్రిని మింగేస్తున్న నిర్లక్ష్యం!



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు. కానీ పేదవాడికి ఉచిత వైద్యం అందించే ప్రభుత్వ ఆసుపత్రుల తలరాతలు మాత్రం మారడం లేదు దీనికి నిలువెత్తు సాక్ష్యం ముథోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి గత ఐదు దశాబ్దాలుగా ముథోల్, లోకేశ్వరం, బాసర, తానూర్ మండలాల పరిధిలోని వందలాది గ్రామాలకు ఏకైక దిక్కుగా ఉన్న ఈ వైద్య కేంద్రం, నేడు అధికారుల, ప్రజాప్రతినిధుల తీవ్ర నిర్లక్ష్యానికి బలవుతోంది

ప్రాణాలు కాపాడే చోట.. ప్రాణభయం!

ఈ ఆసుపత్రి భవనంలోకి అడుగుపెడితే ఎప్పుడు ఏ పెచ్చు ఊడి నెత్తిన పడుతుందో తెలియని పాడుబడిన బంగ్లాను తలపిస్తోంది 1974లో నిర్మించిన ఈ పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది ఇటీవల వార్డులో రోగులు మంచాలపై చికిత్స పొందుతుండగానే, వారి కళ్లముందే పైకప్పు పెచ్చులు విరిగిపడ్డాయి అదృష్టవశాత్తూ ఆ సమయంలో రోగులకు తృటిలో ప్రాణాపాయం తప్పింది ఓపీ విభాగంలో గదుల కొరత ఎంత దారుణంగా ఉందంటే, ఒకే చిన్న గదిలో ఇద్దరు ముగ్గురు వైద్యులు కూర్చుని, ఒకరినొకరు రాసుకుంటూ రోగులను పరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది రోగి తన వ్యక్తిగత అనారోగ్య సమస్యను డాక్టర్‌కు ప్రశాంతంగా చెప్పుకునే కనీస ప్రైవసీ కూడా ఇక్కడ కరువైంది

51 వేల మందికి వైద్యం.. ఇదా మీరు ఇచ్చే బహుమతి?

సదుపాయాలు లేకపోయినా, సిబ్బంది కొరత వేధిస్తున్నా ఇక్కడి వైద్యులు, సిబ్బంది చేస్తున్న సేవలు అద్భుతమనే చెప్పాలి గత 9 నెలల్లోనే ఏకంగా 51 వేల మందికి పైగా రోగులకు ఇక్కడ వైద్యం అందించారు రక్తం మరియు ఇతర ల్యాబ్ పరీక్షల నిర్వహణలో ఈ ఆసుపత్రి జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది ఇంతటి ఘనత సాధించిన ఆసుపత్రిని అక్కున చేర్చుకోవాల్సింది పోయి, ఉన్న సౌకర్యాలను కూడా లాగేసుకుంటున్నారు ఆసుపత్రిలో మొత్తం 33 పోస్టులకు గాను 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి ఉన్న సిబ్బందితోనే బండి లాగిస్తుండగా, ఇక్కడి వైద్య పరికరాల కొరతను సాకుగా చూపిస్తూ కీలకమైన సిబ్బందిని పొరుగునే ఉన్న భైంసా ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై పంపడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ముథోల్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు

మరుగుదొడ్లు లేవు.. శవాలకూ గౌరవం లేదు!

ఆసుపత్రికి వచ్చే రోగులకు, ముఖ్యంగా మహిళలకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం అత్యంత శోచనీయం డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ఆసుపత్రి ప్రాంగణమంతా దుర్వాసన వెదజల్లుతోంది రాత్రి పూట డ్యూటీ చేసే డాక్టర్లు, నర్సులు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవడానికి విడివిడిగా గదులు కూడా లేవు ఇక చనిపోయిన వారి శవాలను ఉంచే పోస్టుమార్టం గది కథ మరీ దారుణం అక్కడ కనీసం మృతదేహాలను కుళ్ళిపోకుండా ఉంచే 'ఫ్రీజర్' సదుపాయం లేదు, సహాయక సిబ్బంది లేరు దీనికి తోడు రాత్రి వేళల్లో ఆసుపత్రి ఆవరణలో విషసర్పాలు, తేళ్లు సంచరిస్తుండటంతో రోగులు, వారి బంధువులు రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు

వైద్య విధాన పరిషత్ మార్చింది ఇందుకేనా?

2022లో ఈ ఆసుపత్రిని తెలంగాణ వైద్య విధాన పరిషత్ (TVVP) పరిధిలోకి మార్చినప్పుడు ముథోల్ ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు కార్పొరేట్ స్థాయిలో నిధులు వస్తాయని, వసతులు పెరుగుతాయని భావించారు కానీ బోర్డులు మారాయే తప్ప, ఆసుపత్రి తలరాత మారలేదు తక్షణమే స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు స్పందించి, ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రికి అన్ని హంగులతో కూడిన నూతన ఆధునిక భవనాన్ని మంజూరు చేయాలని, ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి ఈ ప్రాంత పేద ప్రజల ప్రాణాలను కాపాడాలని 'ప్రజా వాయిస్' డిమాండ్ చేస్తోంది



మధ్యాహ్న భోజనం ఉండగా పిల్లలు ఇళ్ల నుంచి టిఫిన్లు ఎందుకు తెచ్చుకోవాలి?.

- ఊటుపల్లి పాఠశాలలో అధికారుల తనిఖీల తంతుపై విమర్శలు
- పథకం అమలులో ఉన్నా ఇంటి భోజనమే గతి.. పిల్లల ఆకలిని గమనించని ఎంపీవో
- అధికారులు వస్తేనే భోజనం, కూరలు రుచిగా ఉంటాయా?
- తనిఖీల పేరుతో మొక్కుబడిగా తిని వెళ్లిన అధికారుల తీరుపై వ్యక్తమవుతున్న అసంతృప్తి

ప్రజా వాయిస్, కథలాపూర్:కథలాపూర్ మండలం ఊటుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వమే స్వయంగా పాఠశాలల్లో పౌష్టికాహారం అందించాలని మధ్యాహ్న భోజనం అమలు చేస్తుండగా, విద్యార్థులు మాత్రం ఇళ్ల నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుని తింటున్న దృశ్యాలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. పాఠశాలలో రోజూ వండే మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండక పోవడం వల్లే చిన్నారులు ఇళ్ల నుండి క్యారియర్లు తెచ్చుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా మండల పంచాయతీ అధికారి ప్రదీప్ కుమార్, గ్రామ ఉప సర్పంచ్ ముదం శేఖర్, పంచాయతీ కార్యదర్శి మాధవి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అయితే, పక్కనే విద్యార్థులు తమ ఇళ్ల నుండి తెచ్చుకున్న టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటే తనిఖీకి వచ్చిన అధికారులు ఆ విషయాన్ని కనీసం గమనించకపోవడం విడ్డూరంగా ఉంది. కేవలం అధికారులు వచ్చి కూర్చున్న రోజే భోజనం, కూరలు బాగా వడ్డించారా? లేక సాధారణ రోజుల్లో నాణ్యత లేని భోజనం పెడుతున్నందుకే పిల్లలు ఇళ్ల నుంచి తిండి తెచ్చుకుంటున్నారా? అని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఆకస్మిక తనిఖీల పేరుతో వచ్చి మొక్కుబడిగా భోజనం చేసి వెళ్లడం కాకుండా, అసలు పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎందుకు సరిగ్గా అందడం లేదో ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

వార్త రాస్తే బెదిరిస్తారా.?

- జర్నలిస్టుపై కాంగ్రెస్ నేత దురుసు
- మోత్కూరులో మీడియా నిరసన
- బహిరంగ క్షమాపణకు డిమాండ్
- పత్రికా స్వేచ్ఛను కాపాడాలని నినాదం

ప్రజావాయిస్,మోత్కూరు: వార్త రాస్తే బెదిరిస్తారా, ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తే భయపెడతారా, అంటూ యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో జర్నలిస్టులు నిరసన గళం వినిపించారు. ప్రజావారధి జర్నలిస్టు అవిశెట్టి యాదగిరిని బెదిరించిన కాంగ్రెస్ నాయకుడు చింతల విజయభాస్కర్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మోత్కూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు.

వార్తపై అభ్యంతరముంటే ఖండించాలి

జర్నలిస్టు రాసిన వార్తపై అభ్యంతరాలు ఉంటే ఖండన లేదా వివరణతో కూడిన ప్రెస్ నోట్ ఇవ్వాలని, బెదిరింపులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని జర్నలిస్టులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలతో పాటు రాజకీయ నాయకుల వార్తలను నిష్పక్షపాతంగా ప్రచురించే జర్నలిస్టులపై బెదిరింపులు పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్షమాపణ చెప్పకుంటే ఉద్యమం ఉధృతం

జర్నలిస్టును బెదిరించిన కాంగ్రెస్ నాయకుడు విజయభాస్కర్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నాలను సహించేది లేదని, క్షమాపణ చెప్పకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసనలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోత్కూరు ప్రదీప్ శర్మ, ప్రధాన కార్యదర్శి కాపర్తి సైమన్, జర్నలిస్టులు బొడిగె శ్రీహరి, కూరెళ్ల వెంకన్న, మాశెట్టి వెంకన్న, దబ్బెటి రమేష్, ఈదునూరి కృష్ణ, గంట శ్రీనివాస్ రెడ్డి, గాదెనబోయిన నాగరాజు, కూరెళ్ల విష్ణు, మోత్కూరు రమేష్, వారాల రాకేష్, నర్రె సురేష్, వారాల నరేష్, గనగాని రాజేష్, గోపాల్దాస్ సాయి, అవిశెట్టి యాదగిరి, ఎర్రవెల్లి మధు తదితరులు పాల్గొన్నారు.





భర్త ఇంటి ముందు భార్య మౌన పోరాటం..!

- ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడు ముఖం చాటేశాడని ఆరోపణ
- ఐదు నెలల గర్భిణిని వదిలేసి వెళ్లిపోయిన భర్త
- న్యాయం చేయాలని బాధితురాలి ఆవేదన.

ప్రజా వాయిస్ /పాలకుర్తి /అక్టోబర్ 31 జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతపురం గ్రామానికి ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనను వదిలేసి వెళ్లిపోయాడని ఆరోపిస్తూ, ఐదు నెలల గర్భిణి భర్త ఇంటి ముందు న్యాయం కోసం ఆవేదన వ్యక్తం చేస్తున్న ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతపురం గ్రామంలో చోటుచేసుకుంది.పూర్తి వివరాల్లోకి వెళితే.. శాతపురం గ్రామానికి చెందిన గన్న అరవింద్, అదే గ్రామానికి చెందిన గిద్దెల దివ్య గత మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారని బాధితురాలు తెలిపింది. అనంతరం ఇద్దరూ వివాహం చేసుకుని హైదరాబాద్‌లో కొంతకాలం దాంపత్య జీవితం కొన సాగించారని పేర్కొంది.అయితే ప్రస్తుతం ఐదు నెలల గర్భిణిగా ఉన్న తనను భర్త అరవింద్ తల్లిదండ్రుల మాటలు విని వదిలేసి వెళ్లిపోయాడని దివ్య ఆరోపిస్తోంది. తనను, తన కడుపులో పెరుగుతున్న బిడ్డను పట్టించుకోకుండా భర్త దూరంగా ఉండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నానని ఆవేదన వ్యక్తం చేసింది.భర్త ఇంటి ముందు నిలబడి తనకు, తన బిడ్డకు న్యాయం చేయాలని వేడుకుంటోంది. తన జీవితాన్ని, పుట్టబోయే బిడ్డ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చవద్దని కన్నీటిపర్యంతమవుతోంది.ప్రేమించి పెళ్లి చేసుకున్న తర్వాత బాధ్యతలను విస్మరించడం ఎంతవరకు సమంజసమని బాధితురాలు ప్రశ్నిస్తోంది. తనకు న్యాయం జరిగేలా కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతోంది.ఐదు నెలల గర్భంతో ఉన్న బాధితురాలి ఆవేదనపై సంబంధిత అధికారులు స్పందించి, ఆమెకు మరియు పుట్టబోయే బిడ్డకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

స్కాలర్‌షిప్‌ల పేరుతో విద్యార్థులకు వేధింపులా?

- హంటర్ రోడ్ మాస్టర్ జీ కాలేజీపై తీవ్ర ఆరోపణలు!
- ఫీజుల భారం విద్యార్థులపైనా?
- ప్రశ్నిస్తే తల్లిదండ్రులకు అవమానాలా?
- కలెక్టర్, డీఈఓ తక్షణమే స్పందించాలి
- విద్యార్థులకు న్యాయం చేయాలి!

ప్రజా వాయిస్ హనుమకొండ /విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన విద్యాసంస్థల్లోనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. హనుమకొండ జిల్లాలోని హంటర్ రోడ్ మాస్టర్ జీ కాలేజీలో స్కాలర్‌షిప్‌ల ఆధారంగా చదువుకుంటున్న విద్యార్థుల విషయంలో యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

స్కాలర్ షిప్ ల విషయంలో స్పష్టత ఏదీ?

ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రావనే పేరుతో ఒత్తిడికి గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ పిల్లల చదువుకు సంబంధించిన సమస్యపై వివరణ కోరేందుకు కాలేజీకి వెళ్లిన తల్లిదండ్రులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి.అయితే, ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? స్కాలర్‌షిప్‌ల దరఖాస్తుల పరిస్థితి ఏమిటి? విద్యార్థుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

పేద విద్యార్థుల చదువుతో ఆటలాడితే సహించేది లేదు!



పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎన్నో ఆశలతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు తమ చదువుకు అండగా నిలుస్తాయని ఆశిస్తున్నారు. అలాంటి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల స్థితిగతులపై స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.స్కాలర్‌షిప్‌ల మంజూరు ప్రభుత్వ నిబంధనలు, విద్యార్థుల అర్హతలు, దరఖాస్తుల స్థితిగతులపై ఆధారపడి ఉంటుంది. ఈ వివరాలను విద్యార్థులకు తెలియజేయడం, వారి సందేహాలను నివృత్తి చేయడం విద్యాసంస్థల బాధ్యత.

తల్లిదండ్రులను గౌరవించడం కూడా విద్యాసంస్థల బాధ్యతే!

తమ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నించడం తప్పా? విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత యాజమాన్యానికి లేదా? విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇవ్వాల్సింది పోయి, తల్లిదండ్రులను అవమానిస్తున్నారనే ఆరోపణలు వస్తుండటంపై కాలేజీ యాజమాన్యం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.విద్యాసంస్థలు విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా ఉండాలి. విద్యార్థులు తమ హక్కుల గురించి మాట్లాడటానికి భయపడే పరిస్థితులు ఏర్పడకూడదు.

కలెక్టర్, డీఈఓ స్పందించరా?

ఈ వ్యవహారంపై సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), సంక్షేమ శాఖల అధికారులు తక్షణమే స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల ఫిర్యాదులను స్వీకరించి, స్కాలర్‌షిప్‌ల వివరాలు, ఫీజుల వసూళ్లు, తల్లిదండ్రులతో వ్యవహరించిన తీరుపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యం.. ఆరోపణలపై విచారణ ఎప్పుడు?

విద్యార్థులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటారా? మాస్టర్ జీ కాలేజీపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపిస్తారా? విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలకు సమాధానం లభిస్తుందా? అన్నది వేచి చూడాలి.



కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గం

- ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవంలో మడ్డి ఎల్లయ్య పిలుపు

ప్రజా వాయిస్ గోదావరిఖని కార్మికుల హక్కుల పరిరక్షణ, మెరుగైన వేతనాలు, పని గంటల నియంత్రణ, ఉద్యోగ భద్రత, సామాజిక న్యాయం లక్ష్యంగా ఆవిర్భవించిన ఏఐటీయూసీ శతాబ్దానికి పైగా కార్మిక ఉద్యమాలకు వేదికగా నిలిచిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య అన్నారు. ఆర్‌జీ–1 పరిధిలోని జీడీకే 11 ఇంక్లైన్ గని ఆవరణలో ఫిట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మడ్డి ఎల్లయ్య మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఏఐటీయూసీ ఏర్పాటైందని గుర్తుచేశారు. బ్రిటిష్ పాలన కాలంలో పరిశ్రమల్లో పనిచేసిన కార్మికులు తక్కువ వేతనాలు, సుదీర్ఘ పని గంటలు, ప్రమాదకరమైన పని పరిస్థితులు, కనీస సౌకర్యాల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. దేశ పారిశ్రామిక అభివృద్ధిలో కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, హక్కులు దక్కాలంటే సంఘటిత పోరాటాలు అవసరమని పేర్కొన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జీఎం కమిటీ సభ్యులు సిద్దమల్ల రాజు, ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గొడిశల నరేష్, నాయకులు చక్రపాణి, చెప్పాల భాస్కర్, గడ్డం బాలు, దుర్గం తిరుపతి, రియాజ్, దుర్గం శంకర్, సంతోష్ రెడ్డి, అంగడి రమేష్, రంజిత్, శశాంక్, కిరణ్ తదితరులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన 'గమ్మత్తు'!

- మద్యపాన అనర్థాలపై హాస్యభరిత సామాజిక సందేశం
- యాసిన్ ముహమ్మద్ రచించి, దర్శకత్వం వహించిన 'గమ్మత్తు' నాటిక
- అధ్యాపకుల నటనకు ప్రశంసల వెల్లువ

ప్రజావాయిస్ / హైదరాబాద్:హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో ప్రభుత్వ ఐఏఎస్ఈ (IASE), మాసాబ్‌ట్యాంక్ అధ్యాపకులు ప్రదర్శించిన 'గమ్మత్తు' లఘు నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయస్థాయి పోటీలకు కళాకారుల ఎంపికలో భాగంగా అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో ఈ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి.ఈ సందర్భంగా యాసిన్ ముహమ్మద్ రచించి, దర్శకత్వం వహించిన 'గమ్మత్తు' నాటిక మద్యపానం వల్ల కలిగే అనర్థాలు, కుటుంబాలు, సమాజంపై పడే దుష్పరిణామాలను హాస్యభరితంగా వివరిస్తూ సాగింది. అద్భుతమైన స్క్రీన్‌ప్లే, సునిశిత హాస్యం, సహజమైన సంభాషణలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడమే కాకుండా ఆలోచింపజేసింది.నాటికలో పాత్రధారుల సహజ నటన, చక్కటి సమన్వయం, కథనశైలి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న ఇతర బృందాలు సైతం ఈ ప్రదర్శనను అభినందించడం విశేషం. వినోదంతో పాటు విలువైన సామాజిక సందేశాన్ని అందించిన ఈ నాటికకు విశేష స్పందన లభించింది.ఇదిలా ఉండగా, యూట్యూబ్ ఛానల్‌లోనూ అత్యధిక వీక్షణలతో 'గమ్మత్తు' నాటిక ట్రెండింగ్‌లో కొనసాగుతూ పలువురి ప్రశంసలు అందుకుంటోంది.విద్యాబోధనకే పరిమితం కాకుండా కళలు, సాహిత్యం, నాటక రంగాల ద్వారా సామాజిక బాధ్యతను చాటుకోవడంలో ప్రభుత్వ ఐఏఎస్ఈ అధ్యాపకులు చూపిన చొరవ అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి పేర్కొన్నారు. ఈ ప్రదర్శన అధ్యాపకుల్లోని సృజనాత్మకత, కళాత్మక ప్రతిభకు నిదర్శనమని ఆమె అభినందించారు.ఈ లఘు నాటికలో కళాశాల అధ్యాపకులు సదానందం, యాసీన్, నరసింహ, నరేందర్, వెంకటేశ్వర్లు, ఉమాగంగా, సౌజన్య, శ్రీనివాసులు, భరణి తదితరులు పాత్రధారులుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.



అక్రమ నిర్మాణాలపై పంజా

- కబ్జాకోరులకు డెడ్ లైన్ - 3 రోజుల్లో ఖాళీ చేయకపోతే బుల్డోజరే!
- ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదు సర్పంచ్ సంతోష్ ఫైర్
- స్పాట్ కు దూసుకెళ్లిన సబ్ కలెక్టర్ - బ్లేడ్ ట్రాక్టర్ తో చదును
- ఖాళీ చేయని పక్షంలో కఠిన చర్యలు తప్పవు - బుల్డోజర్ వార్నింగ్
- ప్రభుత్వ భూమి జోలికొస్తే తొక్కిపడేస్తాం - కబ్జాకోరులకు చివరి హెచ్చరిక

ప్రజా వాయిస్,కొటాల, కొమరం భీం ఆసిఫాబాద్: ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదంటూ కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి హెచ్చరించారు. చింతలమానేపల్లి మండలం దబ్బా గ్రామ ఎక్స్ రోడ్ వద్ద ప్రభుత్వ స్థల కబ్జాలపై ఉక్కుపాదం మోపారు. మూడు రోజుల్లో ఆక్రమణలు తొలగించకుంటే బుల్డోజర్లతో నేలమట్టం చేస్తామంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు.

సర్పంచ్ ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

డబ్బా గ్రామానికి ప్రధాన కూడలి అయిన ఎక్స్ రోడ్ ప్రాంతంలో రోడ్డు పక్కనే ఉన్న విలువైన ప్రభుత్వ భూమిపై కొంతమంది అక్రమార్కులు కన్నేశారు. రాత్రికి రాత్రే రాళ్లు, ఇనుక, సిమెంట్ తో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి శాశ్వతంగా ఆక్రమించేందుకు పథకం రచించారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే సర్పంచ్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందించి, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదు

వినతి పత్రంలో సర్పంచ్ సంతోష్ ప్రస్తావించిన అత్యంత కీలక అంశం – ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదు. ప్రభుత్వ భూమి అంటే ఊరి ప్రజలందరి సొమ్ము అని, గ్రామ భవిష్యత్తు అవసరాల కోసం, ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు వ్యక్తులు సొంతం చేసుకోవాలని చూడటం సరికాదని



ఆయన ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. ఇలాంటి కబ్జాలను అరికట్టి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్పాట్ కు చేరుకున్న సబ్ కలెక్టర్ - క్షేత్రస్థాయి పరిశీలన

సర్పంచ్ ఫిర్యాదుపై సబ్ కలెక్టర్ హర్ష చౌదరి వెంటనే స్పందించి తనదైన శైలిలో దూకుడుగా వ్యవహరించారు. ఎలాంటి జాప్యం చేయకుండా నేరుగా డబ్బా ఎక్స్ రోడ్ వద్దకు చేరుకుని కబ్జా స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ పరిస్థితిని చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేసిన చెత్తను, అక్రమ నిర్మాణాల కోసం తెచ్చిన సామగ్రిని, తాత్కాలిక అడ్డులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అక్కడికక్కడే బ్లేడ్ ట్రాక్టర్ ను రప్పించి ప్రభుత్వ స్థలాన్ని చదును చేయించి తన మార్క్ పాలన ఏంటో చూపించారు.

మూడు రోజుల డెడ్ లైన్ - బుల్డోజర్ వార్నింగ్

పరిశీలన అనంతరం సబ్ కలెక్టర్ హర్ష చౌదరి కబ్జాదారులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. ఇది ప్రభుత్వ భూమి, ప్రజల సొమ్ము అని, దీని జోలికి వస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్మించిన శాశ్వత కట్టడాలను మూడు రోజుల్లో మీరే స్వయంగా తొలగించి స్థలాన్ని యథాతథంగా అప్పగించాలని, ఒకవేళ మీరు ఖాళీ చేయని పక్షంలో తామే బుల్డోజర్లతో వచ్చి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని తేల్చి చెప్పారు.

కబ్జాకోరులకు చివరి హెచ్చరిక - కఠిన చర్యలు తప్పవు:

ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడేది లేదని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. మూడు రోజుల గడువు తర్వాత కూడా ఖాళీ చేయని పక్షంలో బుల్డోజర్లతో కూల్చివేయడమే కాకుండా, కూల్చివేతకు అయ్యే ఖర్చును కూడా కబ్జాదారుల నుండే వసూలు చేస్తామని, అంతేకాకుండా కబ్జాకోరులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి కబ్జాలు ఎక్కడ జరిగినా ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదు



డబ్బా ఎక్స్ రోడ్ లోని ప్రభుత్వ స్థలం మన ఊరి ప్రజలందరి సొమ్ము. గ్రామ అభివృద్ధి కోసం ఉపయోగపడే ఈ స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదు. అందుకే గ్రామస్తులతో కలిసి సబ్ కలెక్టర్ గారికి ఫిర్యాదు చేశాం. స్పందించి వెంటనే వచ్చి చర్యలు తీసుకున్న సబ్ కలెక్టర్ గారికి ధన్యవాదాలు. ప్రభుత్వ భూమిని కాపాడుకుంటాం."

సంతోష్, సర్పంచ్ డబ్బా

సబ్ కలెక్టర్ హెచ్చరిక..."

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఇది ప్రజల సొమ్ము. అక్రమ కట్టడాలను మూడు రోజుల్లో మీరే తొలగించాలి. లేని పక్షంలో బుల్డోజర్ తో కూల్చివేసి, ఖర్చును మీ నుండే వసూలు చేస్తాం. చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు."

నిత్యం జరగాల్సిన తనిఖీలు నిద్రలేచి చేస్తున్నారా?

- మున్సిపల్ అధికారుల ఆలస్యపు చర్యలపై విమర్శలు
- ప్రతి నెలా జరగాల్సిన సానిటరీ ఇన్స్పెక్టర్, తనిఖీలు ఎందుకు ఆగాయి?

ప్రజా వాయిస్, కోరుట్ల:మున్సిపల్ చట్టం మరియు పర్యావరణ నిబంధనల ప్రకారం పట్టణంలో ఎప్పుడో జరగాల్సిన తనిఖీలను అధికారులు ఇప్పుడు ఆలస్యంగా చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వ్యాపార సంస్థల్లో ప్లాస్టిక్ నిషేధం మరియు ట్రేడ్ లైసెన్సుల పరిశీలన అనేది ఎప్పటికప్పుడు (నిత్యం లేదా నెలవారీగా) జరుగుతుండాలి. కానీ, క్షేత్రస్థాయిలో అధికారులు నిత్య పర్యవేక్షణను గాలికి వదిలేసి, ఏదో ఒక రోజు ఆకస్మిక తనిఖీల పేరుతో హడావుడి చేయడం, జరిమానాలు విధించి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. ప్రజా సమస్యలపై లేదా అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ప్రశ్నిస్తే "ఫిర్యాదు ఇవ్వండి" అంటూ కాలయాపన చేసే అధికారులు, వ్యాపార సంస్థలపై మాత్రం ఇలా ఆలస్యంగా మేల్కొని నామమాత్రపు తనిఖీలు చేయడం ఏమేరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మొక్కుబడి తనిఖీలు మాని, ఎల్లప్పుడూ నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రజా రక్షకుడు.. విపత్తులో మార్గదర్శకుడు.. పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్

పెబ్బేరు ప్రజా వాయిస్ 30 పోలీస్ అంటే కేవలం శాంతిభద్రతలను కాపాడటమే కాదు, కష్ట కాలంలో ప్రజలకు అండగా నిలబడటం కూడా అని నిరూపిస్తున్నారు పెబ్బేరు ఎస్ఐ వెంకటేశ్వర్ గౌడ్. విధి నిర్వహణలో కఠినంగా ఉంటూనే, ప్రజల ప్రాణాల రక్షణ కోసం ఆయన తీసుకునే వినూత్న నిర్ణయాలు స్థానికంగా ఎంతో మంచి గుర్తింపు తెచ్చిపెడుతున్నాయి.వి పత్తు వేళ వినూత్న అడుగు:ఇటీవల కాలంలో ప్రకృతి వైపరీత్యాలు, వర్షాల నేపథ్యంలో ఆయన ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ముఖ్యంగా పిడుగులు పడుతున్న వేళ గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ ఆయన చేపట్టిన వినూత్న కార్యక్రమం ప్రజల మనసులను గెలుచుకుంది.పొలాల్లో ఉండే రైతులు, బయట తిరిగే సామాన్య ప్రజలు పిడుగుపాటుకు గురికాకుండా ఉండటానికి "పిడుగులు పడుతున్న వేళ జాగ్రత్త..!" అంటూ ఆయన స్వయంగా ఇచ్చిన సూచనలు, హెచ్చరికలు సోషల్ మీడియాలో సైతం ఎంతో వైరల్ అయ్యాయి. ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రథమ కర్తవ్యంగా భావించి ఆయన చేసిన ఈ ప్రయత్నాన్ని 'ఇంటి వాళ్ళు' అంటే స్థానిక పెబ్బేరు ప్రజలు, ఉన్నతాధికారులు ఎంతగానో అభినందిస్తున్నారు.ప్రజల గుండెల్లో స్థానం:పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం



చేయడంతో పాటు, సమాజానికి మేలు చేసే ప్రతి విషయంలోనూ వెంకటేష్ గౌడ్ ముందుంటున్నారు. చట్టాన్ని గౌరవిస్తూ, నేరాలను అదుపు చేయడంలోనే కాకుండా, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఒక అన్నలా, ఒక దారిచూపే మార్గదర్శకుడిలా నిలబడటమే ఆయన ప్రత్యేకత.ఈ విధంగా తన వినూత్న ఆలోచనలతో, సేవాభావంతో పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ వెంకటేష్ గౌడ్ తనదైన ముద్ర వేస్తూ, నిజమైన 'జన మైత్రి' పోలీసుగా నిలుస్తున్నారు.



ప్రజల ఆరోగ్యం పై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

ప్రజా వాయిస్, హుజూరాబాద్ (అక్టోబర్ 31): ప్రజలకు వైద్య సేవలు అందించే బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న అధికారులు, సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి, రోగులకు ఆసుపత్రిలో అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డుకు వెళ్లి అక్కడ ఉన్న సౌకర్యాల గురించి సూపర్డెంట్ డాక్టర్ రవీందర్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు, అసిస్టెంట్ కలెక్టర్ హరి ప్రసాద్, హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ హఖీయోద్దీన్ ఖాన్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రభుదాస్, తాశీల్దార్ జక్కని నరేందర్, కమిషనర్ బి కిషన్, కౌన్సిలర్ కోయల్ కార్ భారతి, తదితరులు పాల్గొన్నారు..

అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

- ప్రజా పోరాటాలను పోలీసు చర్యలతో అణచివేయలేరు
- అక్రమ కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి
- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్



ప్రజా వాయిస్ గోదావరిఖని

రామగుండం కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే పోలీసుల ద్వారా ప్రజా పోరాటాలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్ విమర్శించారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రామగుండంలో అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తూ చేపట్టిన నిరసన సందర్భంగా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా గోదావరిఖని వన్‌టౌన్ సీఐ విచక్షణా రహితంగా వ్యవహరించి, దుస్తులు చిరిగేలా మెడలు పట్టుకుని అరెస్టు చేయడం సరికాదని వారు ఖండించారు. తమపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తే పోలీసులతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. రూ.13 కోట్లతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రూ.80 కోట్లతో చేపట్టనున్న వాటర్ ట్యాంక్ పనులకు సంబంధించి ఎలాంటి అవకతవకలు జరగలేదని ఎమ్మెల్యే స్పష్టం చేయాలని సవాల్ విసిరారు. స్థానిక కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకుండా హైదరాబాద్ కాంట్రాక్టర్లకు 10 శాతం కమిషన్ చెల్లించిన వారికే పనులు కట్టబెడుతున్నారన్న ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా కాకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సీఐకి సూచించారు. ఇదే విధంగా వ్యవహరిస్తే న్యాయపోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు కోరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు శనిగరపు చంద్రశేఖర్, రేణుకుంట్ల ప్రీతం, కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ కరీం, రణవేణి సుధీర్ కుమార్, పోతరాజు నాగరాజు, అనూప్ సాయి, కమల్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో వృక్షాల నరికివేత!!

- సిద్దులూరులో అరక ఇన్ఫ్రా సంస్థ నిర్వాకం ఆలస్యంగా వెలుగులోకి
- ప్రధాన రహదారి పక్కన పదుల సంఖ్యలో చెట్ల తొలగింపు
- ఒక చెట్టుకు రెండు మొక్కలు నాటాల్సి ఉండగా.. ఐదు మొక్కలు నాటుతామని సంస్థ హామీ!
- గ్రామపంచాయతీకి మరో వంద మొక్కలు అందజేస్తామని వెల్లడి

ప్రజా వాయిస్ / వికారాబాద్: వికారాబాద్ మండలం సిద్దులూరు గ్రామ పరిధిలో అరక ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపడుతున్న నిర్మాణ పనుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి పక్కన నాటిన పదుల సంఖ్యలో వృక్షాలను సంస్థ తొలగించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అభివృద్ధి పనుల పేరుతో ఏళ్ల తరబడి పెరిగిన చెట్లను తొలగించడంపై స్థానికంగా చర్చ జరుగుతోంది.

పంచాయతీ కార్యదర్శి మధుకర్ రెడ్డి వివరణ ఇలా

ఈ విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, అరక ఇన్ఫ్రా సంస్థ ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు హెచ్ఎండీఏ అనుమతులు పొందిన నేపథ్యంలో ప్రధాన ముఖద్వారం వద్ద ఉన్న చెట్లను తొలగించిన విషయం వాస్తవమేనని తెలిపారు. తొలగించిన ప్రతి చెట్టుకు బదులుగా 1:2 నిష్పత్తిలో మొక్కలు నాటాల్సి ఉంటుందని వివరించారు.అయితే, నిబంధనల ప్రకారం రెండు మొక్కలకు బదులుగా 1:5 నిష్పత్తిలో మొక్కలు నాటుతామని ప్రైవేట్ సంస్థ హామీ ఇచ్చిందని, అంతేకాకుండా గ్రామపంచాయతీకి అదనంగా మరో వంద వృక్షాలను అందజేస్తామన్నారు,పైగా కొనొకార్పస్ వృక్షాలను తొలగించాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు కూడా ఉన్నాయని కార్యదర్శి వెల్లడించారు.



హామీలు అమలయ్యేదెప్పుడు?

చెట్ల నరికివేత అనంతరం మొక్కలు నాటుతామన్న హామీలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలని గ్రామస్తులు కోరుతున్నారు. తొలగించిన చెట్ల సంఖ్యకు అనుగుణంగా మొక్కలు నాటారా? వాటి సంరక్షణ బాధ్యత ఎవరిది? గ్రామపంచాయతీకి అందజేస్తామన్న పంద మొక్కలను ఎప్పుడు అందిస్తారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి హామీల అమలుపై పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మల్లన్నసాగర్ భద్రతకు బ్లాస్టింగ్‌లతో పెను ముప్పు!

- కట్టకు కేవలం 200 మీటర్ల దూరంలోనే పంప్ హౌస్ నిర్మాణం
- 380 మీటర్ల పరిధి నిబంధన ఉల్లంఘనపై వంటేరు ప్రశ్న
- అనుమతులు లేకుండానే పనులు చేపట్టారని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డి తీరుపై వంటేరు విమర్శలు
- హైదరాబాద్ కు 20 టీఎంసీల నీటి తరలింపుపై నిలదీత
- అధికారులిద్దరూ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- పనులు నిలిపివేయకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరిక
- గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ ఎస్ ఇన్ చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం : మూసీ నది సుందరీకరణ పేరుతో మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టకు సమీపంలో చేపడుతున్న పంప్‌హౌస్ నిర్మాణం, భారీ బ్లాస్టింగ్‌లతో రిజర్వాయర్ భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ కట్టను దెబ్బతీసేలా పనులు చేపడుతున్నారని, దీని వెనుక భారీ కుట్ర ఉందని ఆరోపించారు. శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడలోని ఎస్‌ఫోర్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శివధర్మతేజ్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మహేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వంటేరు మాట్లాడుతూ.. తిప్పారం సమీపంలో మూసీ నది సుందరీకరణ కోసం చేపడుతున్న హెచ్‌ఎండబ్ల్యూఎస్ పంప్‌హౌస్ నిర్మాణానికి నీటిపారుదల శాఖ, పోలీస్ శాఖ, తిప్పారం గ్రామపంచాయతీ నుంచి అవసరమైన అనుమతులు పొందలేదని ఆరోపించారు. అయినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగిస్తూ భారీ బ్లాస్టింగ్‌లకు పాల్పడటం దుర్మార్గమన్నారు. అనుమతుల గురించి ప్రశ్నించగా, అవి ఇంకా ప్రక్రియలోనే ఉన్నాయని, పూర్తిస్థాయిలో రాలేదని అధికారులు చెప్పినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండానే పనులు ఎలా ప్రారంభించారని ప్రశ్నించారు. మీడియా అడిగిన ప్రశ్నలకు బాధ్యతాయుతమైన అధికారులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడం సరికాదన్నారు.

కట్టకు 200 మీటర్ల దూరంలోనే నిర్మాణాలా?

మల్లన్నసాగర్ కట్ట ఎత్తు 38 మీటర్లు కాగా, కట్ట ఎత్తుకు పదిరెట్ల దూరం అంటే 380 మీటర్ల పరిధిలో నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధన ఉందని వంటేరు పేర్కొన్నారు. అలాంటప్పుడు కేవలం 200 మీటర్ల దూరంలోనే పంప్‌హౌస్ నిర్మాణం చేపడుతూ భారీ బ్లాస్టింగ్‌లు ఎలా నిర్వహిస్తున్నారని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శివధర్మతేజ్‌ను ప్రశ్నించారు. 380 మీటర్ల పరిధి దాటిన తర్వాతే సంబంధిత శాఖల అనుమతులతో పనులు చేపట్టాల్సి ఉంటుందని పేర్కొంటూ, నిబంధనలను పక్కనపెట్టి పనులు కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రిజర్వాయర్ భద్రతను దృష్టిలో ఉంచుకుని పంప్‌హౌస్‌ను కట్టకు కనీసం 500 మీటర్ల దూరంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా పనులు చేపట్టిన ఏజెన్సీలతో పాటు పనులు ప్రారంభించేందుకు అనుమతించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్‌తో పాటు సంబంధిత ఈఈలు, డీఈలు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులను విధుల నుంచి తొలగించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ కట్ట సమీపంలో నిర్మాణాలు చేపట్టే ముందు భద్రతాపరమైన అంశాలను పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.



లక్షల ఎకరాల సాగునీరు, జిల్లాల తాగునీటికి ముప్పు?

మల్లన్నసాగర్ ద్వారా 16.23 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి తదితర జిల్లాలకు తాగునీటి సరఫరాలోనూ ఈ ప్రాజెక్టు కీలకమని వంటేరు పేర్కొన్నారు. రిజర్వాయర్ కట్టకు ఏదైనా నష్టం జరిగితే వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో పాటు లక్షల ఎకరాల సాగు, అనేక జిల్లాల తాగునీటి సరఫరా ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రిజర్వాయర్‌కు నష్టం వాటిల్లితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

కాళేశ్వరంపై విమర్శలు..

మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీలు ఎలా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందంటూ మాట్లాడుతూనే, అదే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, మూసీ నది సుందరీకరణకు 20 టీఎంసీల నీటిని తరలించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని వంటేరు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని చెబుతున్నప్పుడు, మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకెళ్లే ప్రయత్నం ఎలా చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ నీటి వినియోగం, రిజర్వాయర్ భద్రతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. పంప్‌హౌస్ నిర్మాణంలో స్థానికంగా తయారయ్యే నాణ్యతలేని బాలాజీ స్టీల్‌ను వినియోగిస్తున్నారని వంటేరు ఆరోపించారు. పందేళ్లపాటు ఉండాల్సిన నిర్మాణంలో నాణ్యత లేని ఉక్కును ఉపయోగిస్తే పదేళ్లు కూడా నిలవదని అనుమానం వ్యక్తం చేశారు. నిర్మాణంలో వినియోగిస్తున్న ఉక్కు, ఇతర సామగ్రి నాణ్యతను స్వతంత్రంగా పరిశీలించాలని, పనులను పర్యవేక్షిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మెగా కంపెనీ యాజమాన్యం కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డికి అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం ప్రజల ఆస్తి అయిన మల్లన్నసాగర్ భద్రతను పణంగా పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తాబేదారులుగా మారి కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారని, మల్లన్నసాగర్ విషయంలో ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా తప్పుడు సమాచారం ఇస్తున్నారని వంటేరు విమర్శించారు. రిజర్వాయర్ వద్ద విలేకరుల సమావేశాలు నిర్వహించి ప్రకటనలు చేయడం కాకుండా, నిర్మాణ పనులకు సంబంధించిన అనుమతులు, భద్రతా ప్రమాణాలపై స్పష్టమైన వివరాలు వెల్లడించాలని అధికారులను కోరారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శివధర్మతేజ్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మహేష్ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే అక్కడ జరుగుతున్న కాల్వ తవ్వకాలు, బ్లాస్టింగ్‌లు, పంప్‌హౌస్ నిర్మాణ పనులను నిలిపివేయాలని స్పష్టం చేశారు. పనులు ఆపకపోతే సంబంధిత అధికారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోరాడతామని హెచ్చరించారు.



డిండి ప్రాజెక్టును అడ్డుకోవడం దుర్మార్గం.!

- రాచకొండ లిఫ్ట్ స్కీమ్ కు తక్షణ అనుమతులు ఇవ్వాలి
- 65 వేల ఎకరాలకు సాగునీరు అందించాలి
- నారాయణపురం సీపీఐ మహాధర్నాలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హెచ్చరిక

ప్రజావాయిస్ ,సంస్థాన్ నారాయణపురం: సాగునీటి ప్రాజెక్టులపై కుట్రలు చేస్తూ నల్లగొండ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. డిండి లిఫ్ట్ ప్రాజెక్టు కింద ఎల్లూరు నుంచి నీటిని విడుదల చేయకుండా అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నల్లగొండ జిల్లాకు రావాల్సిన నీటి వాటాను సాధించుకుని తీరుతామని స్పష్టం చేశారు.శివన్నగూడెం నుంచి లిఫ్ట్ ద్వారా రాచకొండలో రిజర్వాయర్ నిర్మించి సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మంత్రులు తమ సొంత నియోజకవర్గానికే ప్రాధాన్యత ఇస్తూ దేవరకొండ, మునుగోడు ప్రాంతాలను విస్మరిస్తున్నారని విమర్శించారు.రాచకొండ లిఫ్ట్ స్కీమ్ ద్వారా 65 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం తక్షణమే పరిపాలనా అనుమతులు, బడ్జెట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.డిండి లిఫ్ట్ కింద నీటి విడుదలకు సీఎం అంగీకరించడం హర్షణీయమని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ మంత్రులు, ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఏపీకి పోలవరం జాతీయ హోదా తెచ్చినట్లే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలని సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, కురిమిద్దె శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, ఏఐవైఎఫ్ రాష్ట్ర బాధ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు, సీపీఐ సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి స్పీకర్ అండ!

- సీఎంఆర్ ఎఫ్ నుంచి రూ.లక్ష ఎల్ ఓసీ మంజూరు!
- అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి వైద్య బరోసా

ప్రజావాయిస్/వికారాబాద్: ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించారు తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్.వికారాబాద్ మండలం అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన సురేష్, సావిత్రి దంపతుల కుమారుడు శివనాగరాజు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న స్పీకర్ వెంటనే స్పందించారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.లక్ష విలువైన ఎల్ఓసీ మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ చూపారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. శివనాగరాజు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం బాధిత కుటుంబానికి అన్ని విధాలా తోడుగా ఉంటుందని తెలిపారు.తమ కుమారుడి వైద్య చికిత్స కోసం అత్యవసర సమయంలో స్పందించి రూ.లక్ష ఎల్ఓసీ మంజూరుకు కృషి చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సురేష్, సావిత్రి దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





దేశంలో పేదవాళ్లకు భూములు పంచిన ఘనత ఇందిరాగాంధీ ది

- దేశ ప్రజల భద్రత కోసం క్లిష్ట పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయం వల్ల ఆమె తూటాలకు బలయ్యారు
- ఇందిరమ్మ ఇచ్చిన భూములే నేటికి పేదలకు జీవనాధారం గా ఉన్నాయి
- భూపంపిణీతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారు
- ఓడీఎఫ్, బీడీఎల్, ఇక్రిశాట్ లాంటి గొప్ప సంస్థలను ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధి కి బాటలు వేశారు
- మెదక్ ఎంపీ గా ప్రధాన మంత్రి హోదాలో ఈ ప్రాంతానికి విశేష సేవలందించారు
- ఇందిరా గాంధీ బాటలోనే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నడుస్తున్నారు
- సంగారెడ్డి లో ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో జగ్గారెడ్డి

ప్రజా వాయిస్ సంగారెడ్డి : ఇందిరాగాంధీ హయాంలో పేదలకు పంపిణీ చేసిన భూములే నేటికీ అనేక కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తున్నాయని టిపిసిసి పార్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఆ భూములను సాగుచేసుకుంటూ పేదలు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద ఆమెకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పేదలకు భూములు అందించి, వారికి ఆర్థిక భరోసా కల్పించడంలో ఇందిరాగాంధీది చారిత్రక పాత్ర అని కొనియాడారు. భూమిని పేద కుటుంబాల బతుకుదెరువు ఆధారంగా మార్చిన ఆమె కృషి మరువలేనిదన్నారు. బ్యాంకుల జాతీయీకరణతో సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేశారని గుర్తుచేశారు.మెదక్ ఎంపీగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఇందిరాగాంధీకి సంగారెడ్డితో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సంగారెడ్డిలో ఆమె పాల్గొన్న రెండు సభలను గుర్తుచేశారు. ప్రధాని హోదాలో జిల్లా పరిషత్ సమావేశంలోనూ పాల్గొన్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఓడీఎఫ్‌తోపాటు బీడీఎల్ పరిశ్రమల ఏర్పాటుకు ఆమె చేసిన కృషిని ప్రస్తావించారు. దేశ భద్రత కోసం క్లిష్టమైన నిర్ణయాలు తీసుకున్న ఇందిరాగాంధీ 1984లో తూటాలకు బలయ్యారని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ పాలన దేశ పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి పునాదులు వేసిందని పేర్కొన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ, తన నానమ్మ ఇందిరాగాంధీ ఆశయాల బాటలో ప్రజల కోసం పనిచేస్తున్నారని జగ్గారెడ్డి అన్నారు.



జాతీయ ఐక్యతతోనే దేశ సమగ్రత సాధ్యం

- ప్రతి ఒక్కరూ ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేయాలి
- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పిలుపు

ప్రజా వాయిస్ పెద్దపల్లి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు జిల్లా అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా అక్టోబర్ 31న జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజల్లో భారతీయులమనే ఐక్యతా భావాన్ని బలోపేతం చేయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన ఉక్కు సంకల్పాన్ని భావితరాలు ఆదర్శంగా తీసుకొని దేశ ఐక్యత, సమగ్రత కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని అదనపు కలెక్టర్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు కొండంత బలం

- రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం
- కాంగ్రెస్ పాలనలో గ్రామాలు, రైతుల సమస్యలకు పరిష్కారం కరువు

ప్రజా వాయిస్ దౌల్తాబాద్ అక్టోబర్ 31: కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి కొండంత బలమని, వారి కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం ఉద్యమాల గడ్డ అని, బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని పేర్కొన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలోని జీఎల్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అలై బలై వేడుకల్లో మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీ అందించడంలో రాయపోల్ మండల కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యకర్తలే పార్టీకి ప్రధాన బలమని, ఎవరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే స్వయంగా వచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. రెండేళ్లలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేల పట్ల వివక్ష చూపుతోందని విమర్శించారు. మూడేళ్లలో ఎమ్మెల్యే కోటా కింద ఏటా రూ.5 కోట్ల చొప్పున రావాల్సిన రూ.15 కోట్ల నిధుల్లో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. దీంతో గ్రామాల్లో రోడ్లు, సీసీ రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రికి వినతిపత్రాలు అందించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లను పూర్తిస్థాయిలో నింపి ఉంటే ప్రస్తుతం వరి పంటలకు సాగునీరు అందించే అవకాశం ఉండేదన్నారు. కేసీఆర్ ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టులు నిర్మించినప్పటికీ కాల్వల పనులు పూర్తికాకపోవడంతో రైతులకు ఆశించిన ప్రయోజనం కలగడం లేదన్నారు. సాగునీరు, ఎరువులు, విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయంపై ఆధారపడిన రాయపోల్ మండలం అభివృద్ధిలో వెనుకబడిందని పేర్కొన్నారు.దుబ్బాక నియోజకవర్గం రెండు జిల్లాలు, పలు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉండటంతో ప్రజలు అధికారుల పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల సౌకర్యార్థం సొంత రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండుసార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించడంలో రాయపోల్ ప్రజలు, కార్యకర్తలు అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు.కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, సర్పంచులు రాజు, మహమ్మద్ పర్వాజ్, వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ లింగయపల్లి యాదగిరి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, వెంకట నరసింహారెడ్డి, ఇస్తారి, ప్రవీణ్, వెంకట్ గౌడ్, సత్యనారాయణ, మల్లారెడ్డి, సీతారాంరెడ్డి తదితరులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.





పౌర హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించిన అధికారులు!

- గోవిందాపూర్ లో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం
- డిప్యూటీ తహశీల్దార్ సురేష్ కుమార్, ఎస్సై భరత్ భూషణ్ హాజరు

ప్రజా వాయిస్/మోమిన్‌పేట్:వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ సురేష్ కుమార్, మోమిన్‌పేట్ ఎస్సై భరత్ భూషణ్ ముఖ్యంగా పాల్గొని గ్రామస్తులకు పౌర హక్కులు, రాజ్యాంగం కల్పించిన చట్టపరమైన హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కుల గురించి తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు. కుల, మత, వర్గ భేదాలకు తావులేకుండా అందరూ సమానత్వ భావనతో మెలగాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. సమాజంలో వివక్షకు తావులేకుండా, చట్టాల పట్ల గౌరవంతో శాంతియుత వాతావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి జగన్ రెడ్డి, గిర్దావర్‌తో సరిత పాటు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి పేషీ అడ్డాగా భూ మాయాజాలం

- ఉద్యోగులే బలిపశువులా?
- తెరవెనుక సూత్రధారులను పట్టించుకోరా?

ప్రజా వాయిస్ | హుజూర్ నగర్ | అక్టోబర్ 31 హుజూర్ నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యంగా రెవెన్యూ శాఖ వివాదాస్పద నిర్ణయాలకు, అక్రమ భూ వ్యవహారాలకు నిలయంగా మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల హుజూర్ నగర్ తహసీల్దార్‌తో సహా ముగ్గురు రెవెన్యూ ఉద్యోగులపై కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సస్పెన్షన్ వేటు వేయడం, మున్సిపల్ శాఖలోని ముగ్గురు ఉద్యోగులపై విచారణకు ఆదేశించడం నియోజకవర్గంలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.అయితే ఈ చర్యల వెనుక అసలు నిజాలు దాగి ఉన్నాయా? కేవలం క్షేత్రస్థాయి అధికారులను బలిచేసి తెరవెనుక కథ నడిపించిన పెద్ద మనుషులను కాపాడుతున్నారా? అన్న ప్రశ్నలు స్థానికంగా గట్టిగా వినిపిస్తున్నాయి.

రెవెన్యూ శాఖను శాసిస్తున్న కీలక వ్యక్తులెవరు?

హుజూర్ నగర్‌లో ఎన్ఎస్పీ, సీలింగ్ భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో రికార్డులను సైతం పరిశీలించకుండా హడావుడిగా క్రయవిక్రయాలు జరగడం వెనుక కేవలం కొద్దిమంది చిన్న ఉద్యోగుల ప్రమేయమే ఉందనుకోవడం అసంభవమనే వాదనలు బలంగా ఉన్నాయి.

మంత్రి పేషీ అడ్డాగా చక్రం తిప్పుతున్న ఆ షాడో వ్యక్తి ఎవరు?

ఒక కీలక మంత్రి పేషీ కేంద్రంగా ఓ షాడో వ్యక్తి కొందరు స్థానిక నాయకులు కలిసి చక్రం తిప్పుతూ రెవెన్యూ మరియు మున్సిపల్ అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. రోజువారీ రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల మార్పిడి (మ్యుటేషన్లు) మరియు ప్రభుత్వ కేటాయింపుల వ్యవహారాల్లో పెద్దల ఆదేశాలు పాటిస్తేనే ఉద్యోగం మిగులుతుందనే పరిస్థితులు సృష్టించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగులే బలిపశువులా?... సూత్రధారుల సంగతేంటి?

పైఅధికారులు లేదా రాజకీయ నాయకుల నుంచి వచ్చే ఆదేశాలను తిరస్కరించలేక, ఒత్తిళ్లకు లొంగి సంతకాలు చేసిన కిందిస్థాయి అధికారులు ఈ రోజు విచారణలు, సస్పెన్షన్ల బారిన పడ్డారు.

ప్రజాక్షేత్రంలో ఉదయిస్తున్న ప్రశ్నలు

అక్రమాలకు పథకం రచించి కోట్ల రూపాయల విలువైన భూములను పక్కదారి పట్టించిన అసలు సూత్రధారులు ఎక్కడ? సంతకాలు పెట్టిన పాత్ర ధారులైన ఉద్యోగుల పైనే చర్యలు తీసుకుని కేసును ఇక్కడితో సరిపెడతారా?తెరవెనుక ఉండి వ్యవహారాన్ని నడిపిన పెద్దల పేర్లను బయటకు తీసే ధైర్యం యంత్రాంగం చేస్తుందా?

కలెక్టర్ గారూ... విచారణ ఎక్కడివరకు?

ఆర్డీవో ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ కఠినంగా స్పందించి తహసీల్దార్ బాండా కవిత, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ కాసిం షరీఫ్, జీపీవో ఎస్.కె. జానీలను సస్పెండ్ చేయడం అభినందనీయమే అయితే ఈ సస్పెన్షన్లు కేవలం తాత్కాలిక కంటితుడుపు చర్యగా మిగిలిపోకూడదని ప్రజలు కోరుకుంటున్నారు.





సమగ్ర విచారణ అత్యవసరం

సస్పెన్షన్లతో సరిపెట్టకుండా, భూ మాయాజాలంలో భాగస్వాములైన రాజకీయ ఒత్తిడిదారులపై, మంత్రి పేషీ పేరు చెప్పి చక్రం తిప్పిన శక్తులపై విజిలెన్స్ లేదా సీఐడీ స్థాయి విచారణ జరిపిస్తేనే నిజాలు వెలుగులోకి వస్తాయి.

బాధ్యులందరిపై చర్యలు

కేవలం ఉద్యోగులను బలిపశువులను చేసి అసలు బాధ్యులను వదిలేస్తే, వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం పూర్తిగా సడలిపోయే ప్రమాదం ఉంది. హుజూర్ నగర్ భూ కుంభకోణంలో ముమ్మందు ఇంకెన్ని సంచలనాలు వెలుగు చూస్తాయో, అసలు తిమింగలాలు చట్టం వలలో చిక్కుతాయో లేదో వేచి చూడాలి.



అనాథ పిల్లల కుటుంబానికి ఆసరా సేవా సమితి చేయూత

- అనసూయ కుటుంబానికి రూ.6 వేల విలువైన నిత్యావసర సరుకుల పంపిణీ
- తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఆపన్నహస్తం
- ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఆసరా సేవా సమితి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :తల్లిదండ్రులను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పిల్లల కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఆసరా సేవా సమితి సభ్యులు అండగా నిలిచారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు పల్లెపహాడ్‌కు చెందిన గూడూరి అనసూయ కుటుంబ పరిస్థితి ఆసరా సేవ సమితి సభ్యుల దృష్టికి రావడంతో వారు ముందుకొచ్చి రూ.6 వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆసరా సేవా సమితి ఉపాధ్యక్షుడు సందానవేణి కనకరాజు, కోశాధికారి దామరంచ దయాకర్‌రెడ్డి, మాట్లాడుతూ.. గూడూరి అనసూయ భర్త శ్రీనివాస్ సుమారు 15 ఏళ్ల క్రితమే మృతి చెందగా, ఇటీవల అనసూయ కూడా అకాల మరణం చెందారని తెలిపారు. దీంతో వారి కుమార్తె, కుమారుడు తల్లిదండ్రుల అండను కోల్పోయారని, కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఇద్దరూ దూరం కావడంతో పిల్లలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలను గుర్తించి తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇప్పటికే నాలుగు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. తాజాగా ఐదో కార్యక్రమంలో భాగంగా అనసూయ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించామని, భవిష్యత్తులోనూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తమ వంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు నిమ్మరాజు రాజు, లింగని రాజు, కొమ్ము చంద్రశేఖర్, మద్దికుంట రమేష్, సాయిబాబా, నాగరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు సర్దార్ పటేల్ సేవలు చిరస్మరణీయం

- గజ్వేల్ లో సర్దార్ పటేల్ జయంతి వేడుకలు
- దేశ సంస్థానాల విలీనంలో ఉక్కు మనిషి చారిత్రక పాత్ర
- యువత ఆయన దేశభక్తి, దృఢ సంకల్పాన్ని ఆదర్శంగా తీసుకోవాలి
- పటేల్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :స్వాతంత్ర్యానంతరం దేశంలోని సంస్థానాలను ఏకీకృతం చేసి భారతదేశ ఐక్యతకు పునాది వేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా శనివారం గజ్వేల్ పట్టణ కేంద్రంలోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్యానంతరం దేశంలోని అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన దృఢ సంకల్పం, ధైర్యం, దేశభక్తి దేశ ఐక్యత, సమగ్రతను బలోపేతం చేయడంలో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే భారతదేశ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు, ఆదర్శాలను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పల మధుసూదన్, సిలివెరి జనార్దన్, బండారు మహేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ల మధు, రాజశేఖర్‌రెడ్డి, కోదండ శ్రీనివాస్‌రెడ్డి, పెండ్యాల శ్రీనివాస్, ప్రజ్ఞాపూర్ కృష్ణ, నరేష్, సూర్యారావు, మహేష్ చారి, నాగపూరి నరేష్, సిరిసిల్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.





పెద్ద చెరువులో అక్రమ మోటార్లు.. ఎండిపోతున్న భూగర్భజలాలు!

- నిబంధనలకు విరుద్ధంగా చెరువులో మోటార్ల ఏర్పాటుపై కొడకండ్ల తహశీల్దార్ కు ఏడునూతల గ్రామ రైతుల ఫిర్యాదు!
- అక్రమ ట్రాన్స్ ఫార్మర్లు, 20 కి పైగా భారీ మోటార్ల తో శివారు భూములకు నీటి తరలింపు
- చెరువు నీరు లేక, బోర్లు అడుగంటి 70 శాతం మంది స్థానిక రైతులు నష్టపోతున్న వైనం

ప్రజా వాయిస్ /కొడకండ్ల జనగామ జిల్లా కొడకండ్ల మండల పరిధిలోని ఏడునూతల గ్రామ పెద్ద చెరువులో కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్నారని, దీనివల్ల గ్రామంలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయని ఏడునూతల గ్రామ రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం (అక్టోబర్ 31, 2026) గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో కొడకండ్ల మండల తహశీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి, తహశీల్దార్ కు ఈ విషయమై రాతపూర్వకంగా ఆ గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు.


అక్రమంగా ట్రాన్స్ ఫార్మర్ల మంజూరు.. వందల ఎకరాలకు తరలింపు!

గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడునూతల గ్రామ పెద్ద చెరువులో గత రెండు మూడు సంవత్సరాల నుండి కొందరు వ్యక్తులు చట్టవిరుద్ధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ను మంజూరు చేయించుకున్నారు. చెరువు లోపల ఏకంగా 7.5 HP సామర్థ్యం గల దాదాపు 20 కి పైగా భారీ మోటార్లను అమర్చి, పైప్‌లైన్ల ద్వారా నీటిని శివారు భూముల్లోకి తరలిస్తూ వరి పంటలు పండిస్తున్నారు.

70 శాతం మంది రైతులకు నీటి నష్టం!

ఈ అక్రమ తోడకాల వల్ల చెరువులోని నీరు వేగంగా అయిపోవడమే కాకుండా, గ్రామంలోని భూగర్భజల మట్టాలు పడిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా గ్రామంలోని దాదాపు 70 శాతం మంది సాధారణ రైతుల బోర్లలో నీరు రాక, పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. చట్ట విరుద్ధంగా చెరువులోకి ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసిన అధికారులపై, మోటార్లు పెట్టిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. తక్షణమే ఆ అక్రమ ట్రాన్స్‌ఫార్మర్లను, మోటార్లను తొలగించి చెరువు నీటిని, గ్రామ రైతులను కాపాడాలని కొడకండ్ల తహశీల్దార్ అనిల్ బాబును కోరారు. ఈ ఫిర్యాదు చేసిన వారిలో ఏడునూతల గ్రామ రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం

- ఆశయాలే కాంగ్రెస్ కు స్ఫూర్తిదేశ ఐక్యత,పేదల సంక్షేమానికి ఆమె చేసిన కృషి మరువలేనిది
- కాటేదాన్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు:ఎన్ ధనుంజయ్
- రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు: పడమటి శ్రీధర్ రెడ్డి

ప్రజా వాయిస్||రాజేంద్రనగర్:భారత మాజీ ప్రధాని,భారతరత్న ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు,ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ చౌరస్తా, రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ వాటర్ ఫిల్టర్ బెడ్ కూడలిలో ఆమె విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాటేదాన్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ్ మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ ప్రజాసేవ, దేశాభివృద్ధి కోసం చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఆమె ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ..దేశ ఐక్యత, పేదల సంక్షేమం,అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు మరువలేనివని అన్నారు.ఆమె చూపిన ప్రజాసేవా మార్గంలో నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు కోరని బాలరాజ్,గోల్కొండ రాజ్ కుమార్,పెండ్యాల శ్రీధర్, రగడంపల్లి శ్రవణ్,సాయి మాలిక్‌తో పాటు మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, మహిళలు,పెద్ద సంఖ్యలో పాల్గొని ఇందిరా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కార్మికుల సమస్యలపై పోరాటమే ధ్యేయం

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేతల పిలుపు



ప్రజా వాయిస్: సిద్దిపేట ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యాలయంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సిద్దిపేట మండల పార్టీ ట్రేడ్ యూనియన్ (TUCC) అధ్యక్షుడిగా పేరుక రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులు బోదాస్ మైసయ్య అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ కార్యదర్శి పాకాల లక్ష్మారెడ్డి, ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్ (TUCC) సిద్దిపేట జిల్లా ప్రెసిడెంట్ ఆలకుంట మల్లేశం, జిల్లా కార్యదర్శి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆలకుంట మల్లేశం మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన కమిటీ కార్మికుల హక్కుల రక్షణకై నిరంతరం శ్రమించాలని కోరారు. సమాజంలో కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అనుబంధ సంఘాలు ఎల్లప్పుడూ ముందుండి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన పేరుక రాజు కు పార్టీ నాయకులు , అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎవరి నిర్లక్ష్యానికి నిండు గర్భిణి మృతి

అసలు ఏం జరుగుతోంది షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో
అటెండర్లు ఆయాలు డెలివరీలు చేస్తే ప్రాణాలు పోవాలి
న్యాయం అడగడానికి వెళ్లిన భర్త రమేష్ ని
పాత కేసులు తీసి అరెస్ట్ చేసిన పోలీసులు
డాక్టర్ల ఫిట్స్ అని ప్రెస్ నోట్‌పై
వెల్లువెత్తుతున్న అనుమానాలు
డాక్టర్ల నిర్లక్ష్యాన్ని తొక్కిపెట్టే కుట్ర శవాన్ని
తీసుకొచ్చినా అప్పగించని వైనం
పోలీస్ స్టేషన్ ఎదుట రమేష్ సోదరుడి సంచలన
వ్యాఖ్యలు అసలు ఏం జరుగుతోంది



(ప్రజా వాయిస్ షాద్‌నగర్)
షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సీహెచ్‌సీ లో వైద్యుల నిర్లక్ష్యానికి నిండు గర్భిణి రాధా ఆమె కడుపులోని శిశువు బలైన ఘటన రోజుకో మలుపు తిరుగుతూ పెను దుమారం రేపుతోంది. భార్య, పుట్టబోయే బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న భర్త మల్లని రమేష్ కుమార్‌కు న్యాయం చేయాల్సింది పోయి, పోలీసులు ఆయన్నే అదుపులోకి తీసుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. వైద్యుల నిర్లక్ష్యాన్ని పక్కకు నెట్టి, పాత గొడవలను తెరపైకి తెచ్చి రమేష్‌పై అక్రమ కేసులు బనాయించే కుట్ర జరుగుతోందని బాధితుడి సోదరుడు పోలీస్ స్టేషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్ వద్ద రమేష్ సోదరుడు తెలిపిన వివరాలు:

మధ్యాహ్నం వరకు అంతా సజావుగానే ఉంది:
తన పినతండ్రి కొడుకైన రమేష్ భార్య రాధాను డెలివరీ నిమిత్తం ఉదయం 11 గంటల సమయంలో షాద్‌నగర్ ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో డెలివరీ మంచిగానే అవుతుంది, సాధారణ ప్రసవమే అని వైద్యులు భరోసా ఇచ్చారని చెప్పారు.

అటెండర్లు,ఆయాలు,ప్ప ఒక్కగైనకాలజిస్ట్ ఉంటే ఒట్టు
షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మొత్తం నలుగురు గైనకాలజిస్టు వైద్యులు నలుగురు అనీస్థీషియా వైద్యులు కామిని ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఒక్క గైనకాలజిస్ట్ కూడా ఆసుపత్రిలో డ్యూటీలో లేకపోవడంతో డెలివరీ సమయంలో ఓ డ్యూటి డాక్టర్ స్టాఫ్



నర్స్ అటెండర్లు ఆయాలు తప్ప ఒక్కరు కూడా లేకపోవడంతో డ్యూటీ డాక్టర్ శుభశ్రీ, స్టాఫ్ నర్స్ జ్యోతి ,ఆయమ్మ అటెండర్లు, జయమ్మ సత్యమ్మ మాత్రమే డెలివరీ సమయంలో గర్భిణీ స్త్రీ రాధ దగ్గర ఉండి సేవలందిస్తున్నారు ఇందులో ఉన్న ఓ డ్యూటి డాక్టర్ మాత్రం సెల్ఫోన్ చేతిలో పట్టుకొని ప్రాణాలతో వైపు రాధ కొట్టుమిట్టాడుతుంటే చూస్తున్న పక్క ఆధారాలు వెలుగులోకి వచ్చాయి మరి వైద్య సిబ్బంది తమ తప్పు ఏమి లేదని చెప్పకుంటే ఈ ఆధారాలతోనైనా వైద్య శాఖ ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకుంటారా ఈ ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బందిని ఇలాగే వదిలేస్తారా అన్నది వేచి చూడాల్సిందే

సాయంత్రానికి శవమైంది..

మెటర్నిటీ హాస్పిటల్ లో చేర్చుకోలేదు:
సాయంత్రం 4 నుంచి 5 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా తీవ్రమైన ఫిట్స్ వచ్చాయని, పల్స్ పడిపోయిందని చెబుతూ రాధా అక్కడే చనిపోయిందని పేర్కొన్నారు. అయితే కడుపులోని బిడ్డనైనా కాపాడవచ్చని చెప్పి, ఆసుపత్రి సిబ్బందే అంబులెన్స్ మాట్లాడి గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ హైదరాబాద్ ఆసుపత్రికి పంపించారని తెలిపారు. తీరా మెటర్నిటీ ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఆమె అప్పటికే చనిపోయిందని అక్కడి వైద్యులు స్పష్టం చేస్తూ అడ్మిట్ చేసుకోవడానికి నిరాకరించారని చెప్పారు.

షాద్‌నగర్‌కు శవాన్ని తీసుకొచ్చినా లోపలికి రానివ్వలేదు:
హైదరాబాద్ మెటర్నిటీ హాస్పిటల్, హాస్పిటల్, నుంచి తిరిగి మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లోనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొస్తే, కనీసం మార్చురీలోకి కూడా తీసుకెళ్లనీయకుండా బయటే ఉంచేశారని ఆరోపించారు. ఆసుపత్రి సిబ్బంది వైఖరిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు రావడం జరిగిందని తెలిపారు.

భర్త రమేష్‌ను అదుపులోకి తీసుకోవడం వెనుక కుట్ర:
ఆసుపత్రి వద్ద వాగ్వాదం జరుగుతున్న సమయంలో రమేష్‌పై దాడి జరుగుతుందన్న సాకుతో పోలీసులు ఆయన్ను పోలీస్



స్టేషన్‌కు తీసుకొచ్చారని తొలుత చెప్పారన్నారు. తీరా చూస్తే, అత్తగారి కుటుంబంతో గతంలో జరిగిన చిన్నపాటి కుటుంబ మనస్పర్థలను (ఇదివరకే పెద్దమనుషుల సమక్షంలో రాజీ కుదిరి పరిష్కారమైన పాత విషయాలను) ఇప్పుడు తెరపైకి తెచ్చి రమేష్‌పై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపేందుకు



అత్తగారు ప్రయత్నిస్తున్నారని, దీని వెనుక ఆసుపత్రి నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చే కుట్ర దాగి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డెడ్‌బాడీ ఎక్కడుందో ఇప్పటికీ సమాచారం లేదు:
ఆసుపత్రి వద్ద ఉన్న మృతదేహాన్ని పోలీసులు వేరే అంబులెన్స్‌లోకి ఎక్కించి ఎటో తీసుకెళ్లారని, ఇప్పటివరకు ఆ డెడ్‌బాడీ ఎక్కడుందో బాధిత కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని వాపోయారు.

అసలు దోషులను వదిలేసి.. బాధితుడిపైనే ప్రతాపమా?
డెలివరీ కోసం వస్తే ఐదున్నర గంటల పాటు ఉంచి, మహిళ మృతికి కారణమైన డ్యూటీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం.. పుట్టెడు దుఃఖంలో ఉన్న భర్తను అదుపులోకి తీసుకోవడం పట్ల ప్రజాసంఘాలు, గ్రామస్థులు భగ్గుమంటున్నారు. మరణానికి బాధ్యులైన వైద్య బృందంపై సమగ్ర విచారణ జరపకుండా, ఈ కేసును దారిమళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి.

ఈ నిర్లక్ష్యం ఎవరిది..!
షాద్ నగర్ కమ్యూనిటీ ప్రభుత్వాసుపత్రిలో ఇప్పటికే నలుగురు గర్భిణీ స్త్రీలకు సంబంధించిన గైనకాలజిస్ట్ వైద్యులు, ఉన్నారు, నలుగురు అనిస్థీషియా మత్తు వైద్యులు విధుల్లో కొనసాగుతున్నారు, ఇంతమంది గైనిక్ వైద్యులు అనిస్థిషియా వైద్యులు ఉండగా గర్భిణీ స్త్రీ రాధకు వెంటనే ఎందుకు సర్జరీ చేయలేకపోయారనేది కుటుంబ సభ్యుల ఆరోపణ చివరికి తల్లి శిశువు మృతి చెందిన ఘటనలో ప్రాణం పోయాక వైద్య సిబ్బంది సంతాపం ప్రకటించారు దాంతో పాటు మరో నేరాన్ని ఆ శవంపై వేశారు వైద్యులు , వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటే ప్రజల ప్రాణాలు గాల్లోకి చేరవంటూ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు...



ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు

ప్రజా వాయిస్ ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల
ఎల్లారెడ్డిపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు సేవలపై ఆరా తీశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ కుల, ఆదాయం, నివాసం ఇతర ధృవీకరణ పత్రాల కోసం, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే అర్జీదారులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు భూముల రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు క్షేత్రస్థాయిలో పరిశీలించి పకడ్బందీగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.



ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను మండల కేంద్రంలో నే నిర్మించాలి... కలెక్టర్ కు వినతి

కొడకండ్ల మండల కేంద్రంలోనే 'యంగ్ ఇండియా' స్కూల్ నిర్మించాలి!

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు కాంగ్రెస్ నాయకులు, స్థానిక సర్పంచ్ వినతి
మండల కేంద్ర పరిధిలోని ప్రభుత్వ స్థలంలోనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్
ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కలెక్టర్ కు విన్నపం

ప్రజా వాయిస్ /కొడకండ్ల,
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్'ను కొడకండ్ల మండల కేంద్ర పరిధిలోని ప్రభుత్వ స్థలంలోనే నిర్మించాలని కోరుతూ స్థానిక సర్పంచ్ దూలం మమతా సతీష్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొడకండ్ల మండల కేంద్రంలోనే ఈ స్కూల్ నిర్మాణం జరుగుతుందని పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి పలుమార్లు ఇచ్చిన మాటను కలెక్టర్ కు గుర్తుచేశారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మండల కేంద్రంలో ఈ విద్యాసంస్థ ను నిర్మించడం వల్ల ఇక్కడి స్థానిక గ్రామీణ ప్రజలకు, విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.

భూమిని పునఃపరిశీలించాలి
స్కూల్ నిర్మాణం కోసం కేటాయించే భూమిని మరోసారి పునఃపరిశీలించి, తగిన విధంగా నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు. దీనిపై ఇప్పటికే ఎమ్మెల్యే ని సైతం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దరావత్ సురేష్ నాయక్, ముఖ్య నాయకులు వెంగల్ రావు, పసునూరి మధుసూదన్, మాసురం రవీందర్, ధర్మారావు భిక్షపతి, యాకూబ్ నాయక్, రంగయ్య, దేశగాని నాగరాజు, బత్తుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ తొలి మహిళ ప్రధాని ఇందిరాగాంధీ కి ఘన నివాళులు

తలకొండపల్లిలో ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి,సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

ప్రజా వాయిస్ తలకొండపల్లి :
తలకొండపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం దేశ ఐక్యతకు ప్రతీక,ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు, దేశ మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా ఇందిరాగాంధీ,సర్దార్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ...స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో చెల్లాచెదురుగా ఉన్న 562 సంస్థానాలను ఏకం చేసి నేటి అఖండ భారతాన్ని నిర్మించిన ఘనత సర్దార్ పటేల్ కే దక్కుతుందని



కొనియాడారు. దేశంలోని సామాన్య రైతుల కోసం, దేశ ఐక్యత కోసం ఆయన చేసిన కృషి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

ఇందిరమ్మ ధైర్యసాహసాలు చిరస్మరణీయం:
బ్యాంకుల జాతీయీకరణ, హరిత విప్లవం ద్వారా దేశాన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేలా చేసిన ఘనత ఇందిరాగాంధీదే అన్నారు. పేదల సంక్షేమం కోసం 20 సూత్రాల పథకం, దేశ రక్షణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ధీరవనిత ఇందిరమ్మ అని గుర్తు చేశారు. వారి ఆశయాలను కొనసాగించడమే మనం వారికి ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, దేశ ఐక్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని,కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఆ దిశగానే పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పడకల్ మాజీ ఎంపిటిసి జోగు రమేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రేణు రెడ్డి,అవంచ నరసింహ రెడ్డి, ఇంద్రకంటి రాఘవేందర్ గౌడ్,అజీజ్,మీసేవ మల్లేష్,నరసింహు,గణేష్,సభావట్ రాజేందర్,శివకుమార్,లక్ష్మయ్య,సంజీవ తదితరులున్నారు.

వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మెట్‌పల్లి నూతన ఆస్పత్రి ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి
రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందాలి
జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



ప్రజా వాయిస్, కోరుట్ల/మెట్‌పల్లి:
మెట్‌పల్లిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభానికి అన్ని రకాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మెట్‌పల్లి, కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెట్‌పల్లి ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాల లభ్యత, ప్రారంభోత్సవ సన్నద్ధతపై వైద్యాధికారులతో సమీక్షించారు. అనంతరం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్.. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, పారిశుధ్య నిర్వహణ మరియు సిబ్బంది హాజరు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలని, విధుల్లో ఎలాంటి అలసత్వం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ఆస్పత్రి ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వనపర్తి మున్సిపాలిటీలో లంచాలకు రుచి మరిగిన అధికారులు అంటూ ఆరోపణలు

చేతులు తడుపుతేనే పని జరుగుతుంది లేదంటే జరగదంటూ పుకార్లు?....
క్రింది స్థాయి అధికారుల నుండి ఉన్నత స్థాయి అధికారుల వరకు ఇదే తంతు ?...
సమాచారం కొరకు ఆఫీసుకు వెళ్లిన అధికారులు ఉండరు ఫోన్ చేసిన ఎత్తరు?...

ప్రజా వాయిస్.. వనపర్తి
వనపర్తి మున్సిపాలిటీ లో లంచానికి రుచి మరిగిన అధికారులు చిన్న పని నుండి పెద్ద పని వరకు వసూలు చేయడానికి ప్రత్యేక ఏజెంట్లును ఏర్పాటు చేసుకుని ఆ ఏజెంట్లు ముడుపులు ముట్టాయి సార్ అని చెప్తేనే అధికారులు సంతకాలు పెడతారు లేదంటే పెండింగ్లో ఉంచుతారు ప్రభుత్వ గైడ్లైన్స్ ప్రకారంగా మున్సిపాలిటీలో ఒక వ్యక్తికి సంబంధించిన జనన మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలన్నా నూతన గృహాలు కట్టుకోవడానికి పర్మిషన్లు కావాలన్నా కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నెంబర్ కావాలన్నా ఇంటికి నల్ల కలెక్షన్ ఇవ్వాలన్న సంబంధిత పత్రాలను జత చేసి గవర్నమెంట్ వారు ఖరారు చేసిన మార్కెట్ వాల్యూ ప్రకారం చాలాన్లు కట్టి ఆన్లైన్లో అప్లై చేసుకుంటే సరిపోదు ఇదంతా కేవలం గవర్నమెంట్ రూల్స్ మాత్రమే..?





మా రూల్స్ మాకు అంటూ అధికారుల పనితీరు !..
మున్సిపాలిటీలో అనుమతి పొందాలంటే కింది స్థాయి ఉద్యోగుల నుండి పై స్థాయి ఉద్యోగుల వరకు చేతులు తడపాల్సిందే?... లేదంటే పని జరగదు ఈ అధికారుల పనితీరుతో వనపర్తి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడమే కాక వారు అనుకున్న సమయానికి అనుమతి పత్రాలు అందక ఆఫీసు చుట్టూ తిరుగుతూ వారి సమయాన్ని వెచ్చించి పని జరగక దిక్కుతోచని స్థితిలో అధికారులు అడిగినంత ముడుపులు ఇవ్వాల్సి వస్తుందని ఆందోళన చెందుతూ ప్రభుత్వంపై పాలకులపై తమ అసహనాన్ని వ్యక్తపరుస్తున్నారు ఇంత జరుగుతున్న ఏసీబీ అధికారుల దృష్టికి వెళ్లడం లేదా తెలిసిన తెలియనట్టు చూస్తూ తీనోడికి తిన్నంత అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు అంటూ విమర్శలు?.. ఇదంతా నిజమే అంటారా?.... లేక ప్రజలకు అనుకూలంగా పనిచేసి వనపర్తి మున్సిపాలిటీ పై వస్తున్న ఆరోపణలు పుకార్లను నిజం కాదని తెలిసేలా అధికారుల పనితీరు మార్చుకుంటారా ?... వేచి చూడాలి మర్రి ....



దేశ ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ లో జాతీయ ఐక్యతా దినోత్సవం.. 2కే రన్ నిర్వహణ

ప్రజావాయిస్ / వికారాబాద్:

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా శనివారం వికారాబాద్ పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. యెన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు సాగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా దేశ ఐక్యత, సమగ్రతను కాపాడాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. దేశ ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు.

దేశ ఐక్యతకు పటేల్ సేవలు చిరస్మరణీయం

బిజెపి నాయకులు కస్తూరి లక్ష్మీనారాయణ, మాడవేణి నరేష్

కోరుట్లలో ఘనంగా పటేల్ జయంతి వేడుకలు

ప్రజా వాయిస్, కోరుట్ల:

దేశ ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని బిజెపి నాయకులు కస్తూరి లక్ష్మీనారాయణ, మాడవేణి నరేష్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని రామ్‌నగర్ చౌరస్తాలో శనివారం పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర రాజేందర్, చెట్లపల్లి సాగర్, మ్యాకల గణేష్, మైదం సత్యనారాయణ, తాళ్లపల్లి శ్రీనివాస్, గోనెల రాజశేఖర్, బాల్క ప్రేమ్ సాగర్, చిట్యాల రాజేంద్ర కుమార్, నారవేణి విజయ్, ఒల్లుజి నాగేష్, రాధారావు సత్యనారాయణ, ఉప్పులూటి రాఘవులు, గోనే రాజారాం, సాడిగే మహేష్, దమ్మ సంతోష్ రెడ్డి, బెక్కం అశోక్, మామిడి మల్లేష్ రెడ్డి, దామా శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





మంజీరా నీటి ట్యాంకులా.. ప్రజల ప్రాణాలకు ముప్పులా?

ప్రజా వాయిస్,పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మంజీరా తాగునీటి ట్యాంకులు ప్రస్తుతం తీవ్ర శిథిలావస్థకు చేరి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రత్యేకించి నర్సింగి గ్రామంలోని మంజీరా మంచి నీటి ట్యాంక్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.?ఏళ్ల తరబడి సరైన నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో సిమెంట్ పెచ్చులు ఊడిపోయి, పిల్లర్లు బలహీనపడి ట్యాంకులు ఎప్పుడు కూలిపోతాయో తెలియని రీతిలో దర్శనమిస్తున్నాయి. రోజువారీ అవసరాల కోసం నీటిని పట్టుకోవడానికి ట్యాంకుల వద్దకు వెళ్లే ప్రజలు, పిల్లలు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంతో వణికిపోతున్నారు.పాపన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న అనేక గ్రామాల్లోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొంది. శిథిలమైన ట్యాంకుల నుంచి నీరు కారడం, ప్రాణాలకు ముప్పుగా మారడంతో స్థానికులు రాత్రివేళల్లో సైతం భయం భయంగా గడపాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి నర్సింగితో పాటు మండలంలోని శిథిలమైన మంజీరా నీటి ట్యాంకులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని లేదా వాటి స్థానంలో కొత్త ట్యాంకులను నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని పాపన్నపేట మండల ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హిందూ వ్యతిరేక విధానాలపై తీవ్ర నిరసన

కాజీపేట వడ్డెర కాలనీలో అర్ధరాత్రి హనుమాన్ విగ్రహ తొలగింపు దుర్మార్గం

రావు పద్మా రెడ్డి

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

హనుమకొండ జిల్లా కాజీపేట సోమిడి విష్ణుపురి కాలనీలోని వడ్డెర కాలనీలో దాదాపు వంద కుటుంబాలు, ఎన్నో సంవత్సరాల నుంచి ఒక చిన్న గద్దె ఏర్పాటు చేసుకొని జెండా ఎగురవేస్తూ, వినాయక, హనుమాన్ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.ఏ ప్లాట్‌కూ ఎలాంటి ఇబ్బంది లేకుండా రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకున్న హనుమాన్ విగ్రహాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు, పోలీసులు అందరూ కలిసి రాత్రికి రాత్రే అక్రమంగా తొలగించడం అత్యంత దుర్మార్గమని రావు పద్మా రెడ్డి తీవ్రంగా



ఖండించారు.ఇతర మతాలకు చెందిన జెండాలు పెడితే తొలగించలేని వారు, హిందువుల విషయానికి వచ్చేసరికి ఇలాంటి అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మొన్న శాయంపేటలో, నిన్న హైదరాబాద్‌లో శ్రీరాముని విగ్రహాలు, నేడు కాజీపేటలో హనుమాన్ విగ్రహాల తొలగింపు చూస్తుంటే... కాంగ్రెస్ పార్టీ పూర్తిగా హిందూ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని స్పష్టమవుతోందని అన్నారు.హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ, ఒకే వర్గానికి కొమ్ముకాస్తున్న ఈ ప్రభుత్వానికి తగిన సమయం వచ్చినప్పుడు హిందూ సమాజం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బాధితులకు మద్దతుగా సంఘటనా స్థలానికి వెళ్తున్న రావు పద్మా రెడ్డి ని సుబేదారి ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు గృహ నిర్బంధం (హౌస్ అరెస్ట్) చేయడం అప్రజాస్వామికమని, ఎన్ని అరెస్టులు చేసినా, ఎంతగా నొక్కిపట్టాలని చూసినా భక్తుల తరఫున, ధర్మ పరిరక్షణ కోసం మా పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు.కాజీపేట వడ్డెర కాలనీలో తొలగించిన స్థానంలో మళ్లీ హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టించే వరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో, కార్యకర్తలు, ప్రజలు మరియు హిందూ సంఘాలతో కలిసి మా పోరాటం నిరంతరం కొనసాగుతుందని రావు పద్మా రెడ్డి తేల్చిచెప్పారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు

దేశ అభివృద్ధికై ఆమె చేసిన త్యాగం వెలకట్టలేనిది

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె అందించిన సేవలు మరువలేనివి

మాజీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య

ప్రజా వాయిస్,కొత్తగూడ

దేశ ప్రథమ మహిళా ప్రధాన మంత్రి, దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన ఉక్కు మనిషి భారతరత్న ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను కొత్తగూడ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బానోత్ రూపుసింగ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, నివాళులర్పించే రీతిలో చేపట్టారు.ఈ కార్యక్రమనీకి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు



అర్పించారు.దేశ అభివృద్ధికై ఆమె చేసిన త్యాగాలను, ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంస్కరణలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.ఈ సందర్భంగా వజ్జ సారయ్య నాయకులు మాట్లాడుతూ... దేశ సమగ్రతను కాపాడటంలో ఇందిరా గాంధీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం, దేశ పారిశ్రామిక మరియు వ్యవసాయ రంగాల అభివృద్ధి కోసం ఆమె ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె అందించిన సేవలను పార్టీ శ్రేణులు స్మరించుకున్నాయి.ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి, యూత్ అధ్యక్షులు చొప్పరి కుమార్, జిల్లా నాయకులు వీరనేని వెంకటేశ్వర్రావు, బొల్లు రమేష్,ఎస్ టీ సెల్ అధ్యక్షులు వజ్జ బాలరాజు,గ్రామ కమిటీ అధ్యక్షులు సిద్దబోయిన లక్ష్మినారాయణ,గొంది రాజు బోడ ఈర్య, ముస్కు వెంకన్న,సోషల్ మీడియా సురేష్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి యాదగిరి కిరణ్, సర్పంచ్ లు మల్లెల భాగ్యమ్మ, బానోత్ దేవేందర్, వాసం శ్రీను కంగాల నాగేశ్వరావు,నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల అధ్యక్షులు, సోషల్ మీడియా ప్రతినిధులు, మహిళా నాయకులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు..

మాట తప్పిన ఎంఐఎం.. మండిపడ్డ చైర్మన్: భైంసా సమగ్ర అభివృద్ధిపై కౌన్సిల్ అజెండా మీటింగ్‌లో రచ్చ!

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

భైంసా, అక్టోబర్ 31 (ప్రజా వాయిస్ ప్రతినిధి):

భైంసా మున్సిపల్ కౌన్సిల్ వేదికగా స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పట్టణ సమగ్ర రూపురేఖలను మార్చే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'మాస్టర్ ప్లాన్' అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే వాగ్వాదం నడుస్తోంది. తాజాగా శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ అజెండా సమావేశంలో ప్రతిపక్ష ఎంఐఎం (వీ×వీ) పార్టీ వ్యవహరించిన తీరుపై మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పట్టణాభివృద్ధి విషయంలో ఎంఐఎం నేతలు నయవంచనకు పాల్పడుతున్నారంటూ ఆయన ధ్వజమెత్తారు.

నిన్న మద్దతు.. నేడు వ్యతిరేకత: బయటపడ్డ ద్వంద్వ వైఖరి!

కౌన్సిల్ అజెండా సమావేశం అనంతరం మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి మీడియాతో మాట్లాడుతూ ఎంఐఎం కౌన్సిలర్ల ద్వంద్వ నీతిని ఆధారాలతో సహా ఎండగట్టారు. "నిన్న గాక మొన్న ప్రెస్‌మీట్ పెట్టి.. భైంసా పట్టణ ప్రగతిని కాంక్షిస్తున్నాం, మాస్టర్ ప్లాన్‌కు



మా పూర్తి మద్దతు ఉంటుంది అని అట్టహాసంగా ప్రకటించిన ఎంఐఎం కౌన్సిలర్లు, సరిగ్గా 24 గంటలు గడవకముందే ప్లేట్ ఫిరాయించారు" అని చైర్మన్ దత్తు ధ్వజమెత్తారు.నేడు అంతర్గతంగా జరిగిన కీలకమైన కౌన్సిల్ అజెండా సమావేశంలో అదే ఎంఐఎం కౌన్సిలర్లు మాస్టర్ ప్లాన్ తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం వారి రాజకీయ స్వార్థానికి అద్దం పడుతోందని విమర్శించారు. ప్రజల ముందు ఒక మాట చెప్పూ, తెరవెనుక కౌన్సిల్ హాల్‌లో పట్టణాభివృద్ధిని అడ్డుకోవడానికి కుట్రలు చేయడం ఎంఐఎం పార్టీకే చెల్లిందని, ఈ మైండ్ గేమ్‌ను భైంసా ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కంటే పట్టణ ప్రజల భవిష్యత్తే ముఖ్యమని, ఇప్పటికైనా ఎంఐఎం తన వైఖరిని మార్చుకుని భైంసా సమగ్ర అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మున్సిపల్ చైర్మన్ కీలక విజ్ఞప్తి

మరోవైపు, పట్టణంలోని పేద ప్రజలకు మేలు చేకూర్చేలా ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయడంపై మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. భైంసా పట్టణ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎవరైతే ఉన్నారో, వారు తమ ఇళ్లకు సంబంధించిన అధికారిక ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా ఆయా వార్డుల కౌన్సిలర్ల వద్ద సమర్పించాలని మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల డాక్యుమెంట్ల పరిశీలన పూర్తయిన వెంటనే తదుపరి నిధుల విడుదల, పనుల పురోగతి వేగంగా జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేసుల్లో కన్విక్షన్ శాతం పెంచేలా సమర్థవంతంగా పనిచేయాలి...

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.... కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ.....

ప్రజా వాయిస్/ నల్గొండ క్రైమ్:

కోర్టుల్లో కేసుల విచారణలో నిందితులకు శిక్షలు పడే కన్విక్షన్ శాతాన్ని మరింత పెంచే దిశగా కోర్టు డ్యూటీ అధికారులు సమన్వయంతో,బాధ్యతాయుతంగా పనిచేయాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కేసుల విచారణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి కేసులో నేర నిరూపణ జరిగేలా సంబంధిత అధికారుల మధ్య సమన్వయం ఉండాలని తెలిపారు.ప్రతి కేసులో దర్యాప్తు సమయంలో సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, ఇతర కీలక పత్రాలను కోర్టులో సమర్పించే విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా దర్యాప్తు అధికారులతో కోర్టు డ్యూటీ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని తెలిపారు. కేసుల విచారణలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.కోర్టుల నుంచి జారీ అయ్యే సమన్లు, వారెంట్ల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సాక్షులు నిర్దిష్ట సమయానికి కోర్టుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమన్లు అందజేయడంలో లేదా సాక్షుల హాజరులో



ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి కేసు విచారణ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తదుపరి విచారణ తేదీలు, కోర్టు ఆదేశాలు, కేసుల ప్రస్తుత పరిస్థితిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అదేవిధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని, కేసుల విచారణకు ముందుగానే సంబంధిత కేసు వివరాలు, సాక్ష్యాధారాలు, సాక్షుల వివరాలను వారికి అందుబాటులో ఉంచాలని తెలిపారు. విచారణ సమయంలో ప్రాసిక్యూషన్ తరఫున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు సమన్వయం చేసుకోవాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సూచించే అంశాలను సంబంధిత దర్యాప్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు.ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. ఈ కేసుల విచారణలో సాక్షుల హాజరు, సాక్ష్యాధారాల సమర్పణ, కోర్టు ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా కృషి చేయాలని తెలిపారు.కేసుల్లో కన్విక్షన్ శాతం పెంపునకు ప్రతి కోర్టు డ్యూటీ అధికారి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, కేసుల విచారణలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో చొరవ చూపాలని అన్నారు. కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన సమన్వయం చేసి, కన్విక్షన్ శాతం పెంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి రమేష్, సీఐలు శ్రీను నాయక్, బీషన్న, సంబంధిత పోలీస్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.



పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు

- బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్ తీవ్ర ఆగ్రహం
- దళిత కార్పొరేటర్లు మరియు ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ ధ్వజం
- అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలని హితవు
- వేధింపులు కొనసాగితే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసనలు చేపడుతామని హెచ్చరిక



ప్రజా వాయిస్ గోదావరిఖని

రామగుండం ప్రాంతంలో కొనసాగుతున్న ఏకపక్ష పాలనపై, ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలపై బీఆర్ఎస్ కార్పొరేటర్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా అధికార పార్టీ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రామగుండం కార్పొరేషన్‌లో దళిత కార్పొరేటర్‌పై, అలాగే సహచర కార్పొరేటర్లపై స్థానిక సీఐ వ్యవహరిస్తున్న తీరు అత్యంత శోచనీయమని సమ్మయ్య యాదవ్ ఆరోపించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన కార్పొరేటర్లకే ఈ రకమైన దుస్థితి ఉంటే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎమ్మెల్యే దృష్టికి రామగుండం ప్రజలు పడుతున్న ఇబ్బందులను, కౌన్సిల్ సమావేశాల్లో అనేకసార్లు చర్చించినా ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. 41వ కార్పొరేటర్ సూర్య (సిపిఐ), అలాగే 15వ డివిజన్ కార్పొరేటర్ భర్తను కావాలని పోలీస్ స్టేషన్‌కు పిలిచి నాన్-బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపడం దారుణమని ఆయన పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పినట్లే పోలీసులు నడుచుకుంటూ, ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. రామగుండం కార్పొరేషన్‌లో ఎక్కడ చూసినా కోతులు, కుక్కలు, పందుల బెడద విపరీతంగా పెరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులు ప్రజల యోగక్షేమాల గురించి మాట్లాడితే వారిని భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని, కేవలం ప్రతిపక్షాల గొంతు నొక్కడమే ధ్యేయంగా ప్రస్తుత పాలన సాగుతోందని సమ్మయ్య యాదవ్ స్పష్టం చేశారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని, ఐదేళ్ల కాలపరిమితిలో ప్రజలకు మంచి పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు. భవిష్యత్తులో కూడా ప్రజా ప్రతినిధులపై ఇలాంటి అక్రమ కేసులు, వేధింపులు కొనసాగితే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రమైన నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఖుతుబోదీన్ పాషా

మెట్‌పల్లిలో ఇందిరమ్మ వర్ధంతి వేడుకలు

ప్రజా వాయిస్, మెట్‌పల్లి:

మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఖుతుబోదీన్ పాషా అన్నారు. శనివారం టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నివాసంలో ఇందిరమ్మ 42వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయీకరణ ద్వారా పేదల సంక్షేమానికి ఇందిరమ్మ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లూరి సాగర్, సమీర్ సర్కార్, ఎండీ అన్వర్, రిజ్వాన్, రియాన్, ముదసీర్, ముస్తఫా, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ 72 వాహనాలు సీజ్..

ప్రజా వాయిస్, శంకరపట్నం (అక్టోబర్ 31):

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో హుజూరాబాద్ సబ్ డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ శనివారం నిర్వహించడం జరిగింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 40 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు రెండు ప్రత్యేక స్ట్రైకింగ్ టీమ్స్ పాల్గొన్నాయి. ఈ సందర్భంగా గ్రామంలోని ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అనుమానిత వ్యక్తులు, గుర్తుతెలియని వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి సారించడం జరిగింది. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి మొత్తం 72 వాహనాలను సీజ్ చేయడం జరిగింది. వీటిలో 65 ద్విచక్ర వాహనాలు, 4 త్రిచక్ర వాహనాలు, 3 నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఏసీపీ హుజూరాబాద్ మాట్లాడుతూ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ద్వారా గ్రామాల్లో నివసిస్తున్న అనుమానితులు, గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించడంతో పాటు అక్రమ కార్యకలాపాలను



ముందుగానే పసిగట్టడానికి,

నేరాలనునియంత్రించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రజల్లో భద్రతాభావాన్ని, ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు నేరస్థుల్లో పోలీసుల పట్ల భయాన్ని కలిగించడానికి ఇటువంటి ఆపరేషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా



పాటించాలని, కొత్తగా నిర్మించిన బైపాస్ రోడ్డుపై వాహనదారులు నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు. ప్రజలు తమ గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం ఎస్ ఐ శేఖర్ రెడ్డి, ఎ ఎస్సైలు, కానిస్టేబుల్లు, గ్రామ ప్రజలు,యువత పాల్గొన్నారు.



రెండో రోజూ కొనసాగుతున్న దివ్య నిరసన దీక్ష!

భర్త ఇంటి ముందు టెంట్ వేసుకుని న్యాయం కోసం బాధితురాలి పోరాటం

ప్రజా వాయిస్ వరంగల్ అర్బన్

తనకు న్యాయం చేయాలంటూ భర్త ఇంటి ఎదుట బాధితురాలు దివ్య చేపట్టిన నిరసన రెండో రోజుకు చేరుకుంది. వరంగల్ శివనగర్‌లోని భర్త ఇంటి ముందు టెంట్ వేసుకుని దివ్య తన నిరసనను కొనసాగిస్తోంది. లండన్ ఉద్యోగం పేరుతో వివాహం చేసుకుని, ఆ తర్వాత తనను పట్టించుకోవడం లేదని భర్తపై ఆరోపణలు చేస్తున్న ఆమె.. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేస్తోంది. రెండో రోజుకు చేరిన ఈ నిరసనపై పోలీస్ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని దివ్య విజ్ఞప్తి చేస్తోంది.

రోడ్డుపై మురికి నీరు..ఎమ్మెల్యే ఆగ్రహం

మురికి నీటిని వదులుతున్న యజమానిపై చర్యలు తీసుకోవాలని,ఎల్లమ్మ ఆలయానికి వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని చేగుంట టు గజ్వేల్ రహదారి దుస్థితి



అక్టోబర్ 31 (ప్రజా వాయిస్)

చేగుంట నుండి గజ్వేల్ కి వెళ్లే రహదారి పరిస్థితి దీనస్థితి, చేగుంట మండలం కర్నాల్ పల్లి ఎల్లమ్మ వలయం చిన్నశివునూర్ గ్రామ శివారులో గల ప్రధాన రహదారిపై సమీపంలో ఏర్పడిన పెద్ద గుంతను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. రహదారిపై ఏర్పడిన గుంతలపై మురికి నీరు నిలువ ఉండడంతో పరిసర ఇళ్ల నుంచి వెలువడుతున్న మురుగునీరు చేరడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారింది. ప్రధాన రహదారిపై గుంత ఉండటంతో ప్రజలకు వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన దుబ్బాక ఎమ్మెల్యే రహదారి దుస్థితిని స్వయంగా పరిశీలించి, సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ఇంత పెద్ద గుంత ఏర్పడినా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మురుగునీరు రోడ్డుపైకి చేరడం వల్ల స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వారు



పేర్కొన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై గుంతను మరమ్మతు చేయడంతో పాటు మురుగునీరు రోడ్డుపైకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సర్పంచులు జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,





కన్నాపూర్ లో కమ్యూనిటీ సీ సీ కెమెరాల ప్రారంభం..

ప్రజా వాయిస్, శంకరపట్నం (అక్టోబర్ 31):

కరీంనగర్ జిల్లా కన్నాపూర్ గ్రామంలో గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని, గ్రామంలోని ప్రధాన కూడళ్లను అనుసంధానం చేస్తూ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. శనివారం హుజురాబాద్ ఏసీపీ మాధవి సీ సీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ రూరల్ సీఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ సీసీ కెమెరాలు గ్రామాల భద్రతలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడానికి, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు మరియు ఇతర నేరాలను అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించడంతో పాటు నేర పరిశోధనలో కూడా సీసీ కెమెరాల ఫుటేజ్ కీలక ఆధారంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు సమన్వయంతో ముందుకు వచ్చి కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజల భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామ భద్రత కోసం చొరవ తీసుకొని కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన కన్నాపూర్ గ్రామ సర్పంచ్‌ను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఇతర గ్రామాలు కూడా కన్నాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని తమ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు.



కార్యకర్తలే బీఆర్ఎస్‌కు కొండంత బలం

- రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం
- కాంగ్రెస్ పాలనలో గ్రామాలు, రైతుల సమస్యలకు పరిష్కారం కరువు

ప్రజా వాయిస్ దౌల్తాబాద్ అక్టోబర్ 31:

కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి కొండంత బలమని, వారి కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం ఉద్యమాల గడ్డ అని, బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని పేర్కొన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలోని జీఎల్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అలై బలై వేడుకల్లో మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీ అందించడంలో రాయపోల్ మండల కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యకర్తలే పార్టీకి ప్రధాన బలమని, ఎవరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే స్వయంగా వచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. రెండేళ్లలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేల పట్ల వివక్ష చూపుతోందని విమర్శించారు. మూడేళ్లలో ఎమ్మెల్యే కోటా కింద ఏటా రూ. 5 కోట్ల చొప్పున రావాల్సిన రూ. 15 కోట్ల నిధుల్లో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. దీంతో గ్రామాల్లో రోడ్లు, సీసీ రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రికి వినతిపత్రాలు అందించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లను పూర్తిస్థాయిలో నింపి ఉంటే ప్రస్తుతం వరి పంటలకు సాగునీరు అందించే అవకాశం ఉండేదన్నారు. కేసీఆర్ ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టులు నిర్మించినప్పటికీ కాల్వల పనులు పూర్తికాకపోవడంతో రైతులకు ఆశించిన ప్రయోజనం కలగడం లేదన్నారు. సాగునీరు, ఎరువులు, విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయంపై ఆధారపడిన రాయపోల్ మండలం అభివృద్ధిలో వెనుకబడిందని పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గం రెండు జిల్లాలు, పలు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉండటంతో ప్రజలు అధికారుల పరంగా ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని, ప్రజల సౌకర్యార్థం సొంత రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండుసార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించడంలో రాయపోల్ ప్రజలు, కార్యకర్తలు అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, సర్పంచులు రాజు, మహమ్మద్ పర్వాజ్, వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ లింగయపల్లి యాదగిరి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, వెంకట నరసింహారెడ్డి, ఇస్తారి, ప్రవీణ్, వెంకట్ గౌడ్, సత్యనారాయణ, మల్లారెడ్డి, సీతారాంరెడ్డి తదితరులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్దార్ వల్లాభాయ్ పటేల్ సేవలు దేశానికి గర్వకారణం

వరంగల్ సీపీ ఎన్.శ్వేత

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం (ఏక్తా దివాస్) సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆయన చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, సర్దార్ వల్లాభాయ్ పటేల్ దేశ సమగ్రత, ఐక్యత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన దేశానికి అందించిన సేవలు ప్రతి భారతీయుడికీ గర్వకారణమని కొనియాడారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనంలో కీలక పాత్ర పోషించి, దేశ ఐక్యతకు పునాది వేసిన ఉక్కు మనిషి ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఏసీపీ మధుసూదన్, జానీ నరసింహులు, ఎ అర్ అదనపు డీసీపీలు సురేష్, శ్రీనివాస్, ఏఆర్ విభాగానికి చెందిన ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



లైంగిక వేధింపులపై అప్రమత్తం..

నారాయణ పాఠశాలలో 'సురక్షిత బాల్యం' అవగాహన సదస్సు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ జిల్లా కేంద్రంలోని నారాయణ హైస్కూల్లో బాలల భద్రతను కాపాడడం సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యత అని విద్యార్థులకు చిన్నతనం నుంచి చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని నిర్మల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ న్యాయమూర్తి పి రవీందర్ పిలుపునిచ్చారు శనివారం నిర్మల్ పట్టణ కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో గల నారాయణ హై స్కూల్ లో విద్యార్థులకు చట్టం బాలల రక్షణ అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైనటువంటి న్యాయమూర్తి పి రవీందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడితే ప్రస్తుత సాంకేతిక యుగంలో అవగాహన లోపం వల్ల చాలామంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు సామాజిక మాధ్యమంలో తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్ లను తిరస్కరించాలని లేనిపక్షంలో ఫోటోలు మార్ఫింగ్ గురై బ్లాక్ మెయిలింగ్ కు దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ లపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని లైంగిక వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే 1098 కి కాల్ చేయాలని లేదా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు ఏజీఎం ప్రసాద్ ప్రిన్సిపల్ డి రమేష్ ను మాట్లాడుతూ విద్యార్థుల మేధ శక్తితో పాటు శారీరక మానసిక భద్రతకు తమ విద్య సమస్యలు ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యత ఇస్తాయని ఇలాంటి అవగాహన సదస్సులు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో రవికుమార్ ఉపాధ్యాయుల బృందం వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

ఉక్కు మనిషి స్ఫూర్తితో దేశ ప్రగతికి తోడ్పడాలి: ప్లెయిర్ పాఠశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి



నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్లెయిర్ పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని "జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ నరసింహారెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జ్ భోజారెడ్డిలు మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్య సమరంలో పటేల్ చూపిన ధైర్యసాహసాలు, దేశ సమగ్రత కోసం ఆయన తీసుకున్న ఉక్కు నిర్ణయాలు నవభారత నిర్మాణానికి పునాది వేశాయన్నారు. నేటి తరం విద్యార్థులు ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు పటేల్ జీవిత విశేషాలను, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ చేసిన ఉపన్యాసాలు ఆలోచింపజేశాయి. అనంతరం విద్యార్థులచే జాతీయ ఐక్యతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతి వేడుకలు

సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి

జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

దేశ ప్రజలందరి ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో దేశ తొలి ఉప ప్రధానమంత్రి, భారత దేశ ఉక్కుమనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు.

అనంతరం జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా దేశ సమైక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీ శంకర్, తహసీల్దార్లు, ఇతర అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలు క్రమబద్ధీకరించాలి

సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన సుంకె ప్రభాకర్ మాదిగ

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ జిల్లా =ఞూ కార్యాలయం ఎదుట గత 19 రోజులుగా సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకె ప్రభాకర్ మాదిగ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం వైద్య సేవలందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, వేతనాల పెంపు, ప్రసూతి సెలవులు తదితర న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

గత పదేళ్లుగా వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా, పీఆర్సీ అమలు చేయకుండా ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సమాన పనికి సమాన



వేతనం కల్పించడంతోపాటు హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ సహా ఎనిమిది రాష్ట్రాల్లో చేపట్టిన విధానాలను పరిశీలించి తెలంగాణలోనూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వానికి సూచించారు.జీవో 510 ద్వారా వేతనాలు పెరగని ఉద్యోగులకు న్యాయం చేయాలని, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సమ్మె చేస్తున్న ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని సుంకె ప్రభాకర్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వీఎూ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ మైస ఉపేందర్ అన్న ఆదేశాల మేరకు చీఎవీ ఉద్యోగుల 19 వ రోజు దీక్షకు మద్దతు తెలపడం జరిగింది కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి కత్తి విష్ణు, కళాకారుడు దరువు భోజన్నతో పాటు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ జట్టుకు జడ్పీహెచ్‌ఎస్ గూడూరు విద్యార్థి వరుణ్ ఎంపిక

ఉమ్మడి వరంగల్ జిల్లా జేఎన్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ..

వరుణ్‌కు ఎంఈఓ పోతుగంటి నర్సయ్య అభినందనలు

ప్రజా వాయిస్ /పాలకుర్తి/ అక్టోబర్ 31:

క్రీడా రంగంలో పాలకుర్తి మండలానికి మరోసారి గుర్తింపు లభించింది. మండలంలోని గూడూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) విద్యార్థి వరుణ్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు.ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని జేఎన్ఎస్ గ్రౌండ్‌లో నేడు నిర్వహించిన అండర్-14 బాలుర వాలీబాల్ ఎంపిక పోటీల్లో వరుణ్ పాల్గొని తన అద్భుతమైన ఆటతీరుతో ప్రతిభను చాటుకున్నాడు. పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి జట్టులో చోటు సంపాదించాడు. దీంతో గూడూరు గ్రామంతో పాటు పాఠశాల వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.విద్యార్థి వరుణ్ సాధించిన విజయంపై మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నర్సయ్య ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. చిన్న వయస్సులోనే క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ. శైలజ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఉన్నత విజయాలు సాధించవచ్చని తెలిపారు.వరుణ్‌కు ప్రత్యేక శిక్షణ అందించి రాష్ట్రస్థాయికి ఎదిగేలా ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయుడు చిట్యాల యాదిని పలువురు అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు ఐ. శైలజతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు వరుణ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ వరుణ్ అద్భుత ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, గూడూరు గ్రామానికి, పాలకుర్తి మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.





జీలుగుల గ్రామంలో ఇందిరాగాంధీ 42వ వర్ధంతి ఘనంగా నివాళులు..

కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

ఎల్కతుర్తి మండలం జిలుగుల గ్రామంలో బస్టాండ్ వద్ద భారత దేశ తొలి మహిళ ప్రధానమంత్రి ఉక్కు దివంగత ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ ఘనబోయిన సృజన రాజు యాదవ్ అధ్యక్షతన, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తౌటం నరేందర్ ఆధ్వర్యంలో గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మాట్లాడుతూ, దేశానికి చేసిన సేవలను దేశ ఐక్యత సమగ్రత కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూటం జోగిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తంగేళ్ల ప్రవీణ్ కుమార్, కుక్కల ఎర్రయ్య, పల్లె శ్రీధర్, ఆరేపల్లి ప్రభాకర్, ఆరేపల్లి సారయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో "పొగాకు రహిత పై అవగాహన సదస్సు & ర్యాలీ

ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్

ఆత్మకూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎమ్ నిర్మల కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల దుష్ఫలితాలపై నేడు అవగాహన సదస్సు మరియు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ సిగరెట్, బీడీ, గుట్కా మరియు ఇ-సిగరెట్ల వాడకం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండెజబ్బులు వస్తాయని, చిన్న వయస్సులోనే పొగాకు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పొగాకు వ్యతిరేక నినాదాల ప్లకార్డులతో ఆత్మకూరు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల పరిసరాల 100 గజాల పరిధిలో పొగాకు అమ్మకాలు చట్టరీత్యా నేరమని, తమ బడిని 'పొగాకు రహిత విద్యాసంస్థ'గా కొనసాగిస్తామని హెచ్.ఎమ్ స్పష్టం చేశారు. కార్యక్రమాంతంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పొగాకు వాడబోమని ప్రతిజ్ఞ చేశారు..ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



పదవీ విరమణ తర్వాతా ప్రైవేట్ వైద్య సేవలా?

అనుభవం ప్రజలకు వరమా.. పర్యవేక్షణ లేకుంటే సమస్యా?

ఆసుపత్రులు, క్లినిక్‌ల నిర్వహణపై చర్చ

ప్రైవేట్ వైద్య సేవలపై వైద్య ఆరోగ్య శాఖ నిఘా ఏదీ?

ప్రజావాయిస్ / వికారాబాద్ జిల్లా బ్యూరో:

ప్రభుత్వ వైద్య సేవల నుంచి పదవీ విరమణ పొందిన కొందరు వైద్యులు తిరిగి ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తుండటంపై వికారాబాద్ జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో చర్చ జరుగుతోంది. అనుభవజ్ఞులైన వైద్యులు సేవలు కొనసాగించడంలో తప్పులేదని, అయితే రోగుల భద్రత, వైద్య ప్రమాణాలు, నిబంధనల అమలు తప్పనిసరిగా ఉండాలని మేధావులు అభిప్రాయపడుతున్నారు.వైద్య పరిజ్ఞానం, చికిత్సా విధానాలు ఎప్పటికప్పుడు మారుతున్న నేపథ్యంలో వైద్యులు ఆధునిక పద్ధతులపై అవగాహన కలిగి ఉండటం అవసరం. కేవలం గత అనుభవమే కాకుండా ప్రస్తుత వైద్య నైపుణ్యం, సామర్థ్యం, బాధ్యతాయుతమైన సేవలు కూడా కీలకమని పేర్కొంటున్నారు.

నిరంతర తనిఖీలు అవసరం

జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌ల రిజిస్ట్రేషన్లు, వైద్యుల అర్హతలు, వైద్య సదుపాయాలు, అత్యవసర ఏర్పాట్లపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలి

వైద్య సేవలు అందించడం తప్పు కాదు.. కానీ అవి నిబంధనలకు అనుగుణంగా, రోగుల ప్రాణాలకు భరోసా కల్పించేలా ఉన్నాయా లేదా అన్నదే అసలు ప్రశ్న. పదవీ విరమణ పొందిన వైద్యుల ప్రైవేట్ సేవలపై నిబంధనలను స్పష్టం చేస్తూ, ఆసుపత్రుల నిర్వహణపై అధికారులు సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రవి మృతి పార్టీకి తీరని లోటు..

మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి.....

ప్రజా వాయిస్ పాపన్నపేట..

పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన బి ఆర్ ఎస్ కార్యకర్త ఏడుపాయల రవి బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందడం పార్టీకి కుటుంబానికి, తీరని లోటని పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి తో కలిసి రవి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, భార్యా పిల్లలకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు.



అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేయించుకోవాలి

ప్రజా వాయిస్,మోత్కూరు, (అక్టోబర్ 31):

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని దత్తప్ప గూడెం గ్రామంలో నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.జిల్లాలోని అర్హులైన పట్టభద్రులందరూ ఫారం 18 ద్వారా నవంబర్ 6 తారీకు లోపు ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు., టిఆర్ఎస్ నాయకత్వం ముందుండి అర్హులైన అందరూ ఓటు నమోదు చేసుకునే విధంగా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎలుగు శోభ సోమయ్య, ఎమ్మెల్సీ ఓటు నమోదు ఇంచార్జ్ ఉదయ్ కుమార్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బండి వెంకటేష్, వార్డు మెంబర్లు బొడ్డు అవిలయ్య, బొడ్డు మహేష్, మాజీ కో ఆప్షన్ ఎంపీటీసీ అఫ్రోజ్ జానీ, మాజీ వార్డ్ మెంబర్ ఎలుగు మచ్చగిరి, టిఆర్ఎస్వి మండల ప్రధాన కార్యదర్శి నాయిని ఉపేందర్, పార్టీ నాయకులు గనగాని వెంకటయ్య, రహీం భాష, బలిక బిక్షం, దేవసరి స్వామి, ముక్కెర్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.





నాలుగు లక్షల నిధులతో బోర్ వెల్ పనులకు భూమి పూజ...

ప్రజా వాయిస్, కరీంనగర్ (అక్టోబర్ 31):

గ్లోబల్ వామింగ్, ఎల్ నినో ప్రభావ దృష్ట్యా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి, త్రాగు నీటి సరఫరా లో భాగంగా శనివారం 4 వ డివిజన్ లో మేయర్ పర్యటించారు. దుర్నెడ్ లో స్థానిక కార్పోరేటర్ భూపతి రవీందర్‌తో కలిసి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4 లక్షలతో దుర్నేడ్ నేతకాని సంఘం,క్వార్టర్స్‌లోని ఎస్సీ కాలనీలో రెండు చోట్ల నూతన బోర్ వెల్స్ నిర్మాణ పనులకు భూమీ పూజ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ భూపతి రవీందర్, శ్రీధర్ సంపత్ సారయ్య భూమయ్య ప్రకాష్ మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన కురువ చిన్న మల్లయ్య

ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్న ట్రస్ట్ చైర్మన్

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

చిన్నంబావి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన పెద్ద మాసన్న కుమారుడు పరిమళ నరసింహ అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీ ప్రహర్ష దేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కురువ చిన్న మల్లయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు.మృతుని భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో వారికి అండగా నిలిచేందుకు తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు.ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే నిజమైన సామాజిక బాధ్యతగా భావిస్తూ కురువ చిన్న మల్లయ్య అందించిన ఆర్థిక సహాయంపై గ్రామస్థులు, పలువురు అభినందనలు తెలిపారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జడ్పీ సీఈఓ నాగలక్ష్మి



జూలూరుపాడు, ప్రజా వాయిస్:

గ్రామాలలో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు వీబి జి రాంజీ పనులకు హాజరై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పీసీఈఓ నాగలక్ష్మి తెలిపారు. శనివారం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో రెండో రోజు మేట్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ సూపర్ ఎల్ ని నో ప్రభావంతో రానున్న రోజుల్లో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా పనిచేసి నష్టాన్ని నివారించే విధంగా కృషి చేయాలని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవటంతో రానున్న రోజుల్లో తాగునీరు దొరకటం ఇబ్బందికరంగా ఉంటుందని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, రైతులు పొలాలలో నీటి కుంటల నిర్మాణాలను చేపట్టాలని కోరారు. సెక్షన్ లో నేర్చుకున్న అంశాలను మేట్లు క్షేత్ర స్థాయిలో అమలు చేసి, పనులను పారదర్శకంగా చేపట్టే విధంగా కృషి చేయాలని అన్నారు. ఎలాంటి అవక తవకలు జరగకుండా నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. కూలీలకు రోజువారి వేతనం రూ 308లు పడే విధంగా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని మేట్ల ను ఆదేశించారు. ఉపాధి పనులలో ప్రజలను అధిక సంఖ్యలో భాగస్వాములను చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, ఏపీఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.





పరకాల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ప్రజా వాయిస్ హన్మకొండ /దామెర

పరకాల బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, మరో అధ్యాపకుడు (హౌజ్ మాస్టర్)ను సస్పెండ్ చేసినట్లు గురుకుల కళాశాలల జోనల్ అధికారి అపర్ణ తెలిపారు. దామెర మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో పరకాల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ఉంది. ఇక్కడ విద్యార్థుల గదిలో మద్యం, సిగరెట్లు, సెల్ఫోన్లు లభ్యమయ్యా యి. ఈఘటనలో క్రమశిక్షణ కమిటీ సభ్యులు,14 మంది విద్యార్థులను కళాశాల నుంచి గత నెల సస్పెండ్ చేశారు.నిఘా లోపంతోనే మద్యం, మత్తు పదార్థాలు కళాశాల లోకి వచ్చాయని పేర్కొంటూ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ ఆనందరావు, హౌజ్ మస్టర్ శంక రన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జోనల్ అధికారి పేర్కొన్నారు.



ఉక్కుమనిషికి ఘన నివాళి

స్వామి వివేకానంద గురుకుల్ లో ఘనంగా సర్దార్ పటేల్ జయంతి వేడుకలు

ప్రజావాయిస్/వికారాబాద్:

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను స్వామి వివేకానంద గురుకుల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,మాజీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు టి. సదానంద రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం వికసిత్ భారత్-2047 లక్ష్యాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్ కుమార్, పార్లమెంట్ నాయకుడు అమరేందర్ రెడ్డి, వికారాబాద్ మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్, నాయకుడు ప్రశాంత్ కుమార్, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాలకులకు కమీషన్లపై ఉన్న సోయి కరువుపై లేకపాయే..

- నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలి

- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి డిమాండ్

ప్రజా,వాయిస్, తిమ్మాపూర్ (అక్టోబర్ 31):

రాష్ట్రమంతా కరువు కాటకాలతో అల్లాడుతుంటే ప్రభుత్వం పంటలు వేయొద్దని డిక్లరేషన్లు కోరుతూ కరువు జాబితాలో కొన్ని మండలాలనే చేర్చడం ఏంటని, పాలకులకు కమీషన్లపై ఉన్న సోయి కరువుపై లేదని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కరువుతో పంటలు వేయద్దు అన్నప్పుడు అన్ని మండలాలు కరువు జాబితాలో చేర్చాలి అని డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం ఉంటుందని తెలిసి కూడా పైనుండి వస్తున్న నీళ్లను ఎత్తిపోయకుండా జాప్యం చేసి ఇప్పుడు పంటలు వేయద్దని కోరడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 10 ఏళ్ల కాలంలో కాలమైనా కాకపోయినా ఎండల్లో సైతం కాలువల్లో నీళ్లు పరుగులు పెట్టాయని గుర్తు చేశారు. ఎలాంటి ముందస్తు ఆలోచన లేని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కనీసం నియోజకవర్గంలోని మండలాలను కరువు జాబితాలో చేర్చుకోలేని దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో రాష్ట్రానికి నీళ్లు అందించే ప్రముఖ ప్రాజెక్టులు ఉన్నా కూడా కరువు లేకుండా చేయలేకపోతున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని కరువును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేని దౌర్భాగ్యంలో ఆయన ఉన్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి కమీషన్ల కక్కుర్తిలో గాలికి వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు మండలాల్లో చేర్చకపోతే ఎమ్మెల్యేని బాధ్యత వహించాలని, వారం రోజుల్లో జాబితాలో చేర్చకపోతే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు.



వనపర్తి జిల్లా కలెక్టర్ సెలవులో - ఇన్ ఛార్జ్ గా గద్వాల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా

ప్రజా వాయిస్.. వనపర్తి

వనపర్తి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదర్శ్ సురభి వ్యక్తిగత కారణాలతో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 13 వరకు 15 రోజుల పాటు సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వనపర్తి జిల్లా కలెక్టర్ గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ సి ఏ) నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెలవు ముగిసిన అనంతరం ఆదర్శ్ సురభి తిరిగి బాధ్యతలు స్వీకరించనున్నారు.



ఓటరు నమోదుపై బీఆర్ఎస్ గురి వారం రోజుల్లో వంద శాతం లక్ష్యం.!

ప్రతి గడపకూ వెళ్లి ఓటర్లను చైతన్యపరచాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ గెలుపే లక్ష్యం

బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఏలూరి వెంకటేశ్వరరావు పిలుపు

ప్రజా వాయిస్, మోతె, అక్టోబర్31:-

పట్టభద్రుల ఓటరు నమోదును వారం రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఏలూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. శనివారం మోతె మండలం రాఘవపురం ఎక్స్‌రోడ్‌లో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి సమీక్షించారు. ప్రతి గడపకూ వెళ్లి పట్టభద్రులను చైతన్యపరచాలని, నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా గాంధీ, కారింగుల కమలాకర్‌గౌడ్, మండవ రాము, తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నడికుడలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష సమావేశం

ప్రజా వాయిస్ హన్మకొండ /నాడికుడా

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై నడికుడ మండల కేంద్రంలోని మారుతి గార్డెన్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పట్టభద్రుడి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం నూతన ఓటరు జాబితాలో తిరిగి నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హులైన ఒక్క పట్టభద్రుడు కూడా ఓటరు నమోదుకు దూరం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నిబంధనలు, నమోదు విధానంపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సాంబారి సమ్మారావు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అర్హులైన పట్టభద్రులను గుర్తించి నమోదు చేయించేలా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వాయిస్



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహణ

ప్రజా వాయిస్ : హాలియా : అక్టోబర్ 31:

హాలియా పురపాలక సంఘ కార్యాలయంలో భారతదేశ ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా హాలియా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గౌని రాజారమేష్ యాదవ్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు . అనంతరం జాతీయ ఐక్యత, సమగ్రత, సమైక్యతను కాపాడేందుకు ఆయన చూపిన మార్గంలో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, చెరుపల్లి ముత్యాలు, బొంగరాల యేసు రాజు, దీపావత్ ప్రసాద్ నాయక్, కౌన్సిలర్ల సలహాదారులు చిట్టిపోలు కరుణాసాగర్, ఎడవల్లి రంజిత్, కో-ఆప్షన్ సభ్యులు, వర్కాల శేఖర్ రెడ్డి, ఎండి రషీద్ గార్లు మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఏటి కాలువకు పునర్జీవం!

సర్పంచ్ ఎలికట్టి భరత్ చొరవతో కదిలిన ఇరిగేషన్ అధికారులు

భీమారం నుంచి రావులపెంట వరకు కాలువ పునరుద్ధరణకు క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజావాయిస్ వేములపల్లి:

వేములపల్లి మండల పరిధిలోని భీమారం నుంచి రావులపెంట వరకు ఉన్న ఏటి కాలువ పునరుద్ధరణకు ఎట్టకేలకు అడుగులు పడుతున్నాయి. గత 15 ఏళ్లుగా కాలువకు పలుచోట్ల గండ్లు పడటం, పూడిక పేరుకుపోవడం, ఆక్రమణల కారణంగా నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ఆయకట్టు రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి కాలువ పునరుద్ధరణకు కృషి చేస్తున్న లక్ష్మీదేవి గూడెం స్థానిక సర్పంచ్ ఎలికట్టి భరత్ చొరవతో ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. లక్ష్మీదేవి గూడెం సర్పంచ్ ఎలికట్టి భరత్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ శాఖ డీఈ జనార్దన్, ఏఈ సాయిరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కాలువను పరిశీలించారు. కాలువకు గండ్లు పడిన ప్రాంతాలు, పూడిక పేరుకుపోయిన ప్రదేశాలు, ఆక్రమణలకు గురైన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కాలువ పునరుద్ధరణకు అవసరమైన పనులు, చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.ఏళ్ల తరబడి సాగునీటికి దూరమైన రైతులకు తిరిగి నీటి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో కాలువ పునరుద్ధరణ పనులను త్వరితగతిన చేపట్టాలని లక్ష్మీదేవి గూడెం సర్పంచ్ ఎలికట్టి భరత్ ఇరిగేషన్ అధికారులను కోరారు. కాలువకు పూర్వవైభవం తీసుకొచ్చి రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న కాలువ పునరుద్ధరణకు కదలిక రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అధికారులు త్వరితగతిన పనులు ప్రారంభించి తమ పొలాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలికట్టి భరత్, ఇరిగేషన్ డీఈ జనార్దన్, ఏఈ సాయిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సరళమైసమ్మ ఆలయంలో కుమ్మర్ల కి

హక్కులు కల్పించండి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కి కుమ్మర సంఘం వినతి

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీ సరళమైసమ్మ దేవాలయంలో తమ కులస్తులకు సంప్రదాయ పూజారి హక్కులు కల్పించి, సుమారు 200 కుమ్మరి కుటుంబాల జీవనోపాధికి న్యాయం చేయాలని కోరుతూ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకి వినతిపత్రం అందజేశారు. ?రాచకొండ రెవెన్యూ పరిధిలోని సరళమైసమ్మ ఆలయంలో వంద సంవత్సరాలకు పైగా తమ పూర్వీకులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారని సంఘం ప్రతినిధులు తెలిపారు. అయితే ఈ సంప్రదాయాన్ని కొనసాగించకుండా గతంలోనూ, ఇటీవల అక్టోబర్‌లోనూ కొందరు వ్యక్తులు తమపై దాడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపురం మండలానికి చెందిన సుమారు 200 కుమ్మరి కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం తమకు పూజా హక్కులు కల్పించడంతో పాటు, గతంలో జరిగిన దాడులపై విచారణ జరిపి రక్షణ కల్పించాలని వారు కోరారు.



కరువు జాబితాలో గుర్రంపోడు అనుములకు చోటివ్వాలి

రైతుల కష్టాలను గుర్తించి తక్షణమే న్యాయం చేయాలి

జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్సీ కోటిరెడ్డి వినతి.. క్షేత్రస్థాయి పరిశీలనకు హామీ

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం

నల్లగొండ జిల్లాలో కరువు పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గుర్రంపోడు, అనుముల మండలాలను తక్షణమే కరువు మండలాల జాబితాలో చేర్చాలని ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రెండు మండలాల నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోటిరెడ్డి మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, గుర్రంపోడు, అనుముల మండలాలను కరువు జాబితాలో చేర్చి రైతులకు ప్రభుత్వ సహాయం అందించాలని కోరారు.రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు పాశం గోపాల్ రెడ్డి (పీజీఆర్) మాట్లాడుతూ రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికను ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మునుకుంట్ల రాజేష్ రెడ్డి, పగిళ్ల సైదులు, వేముల యాదయ్య, పోలే రామచంద్రం, మల్లేష్, కురుమాల్ రెడ్డి, బచ్చనబోయిన శీను, వెంకట్ రెడ్డి, శ్రీరాములు, మేక రఘుపతి రెడ్డి, మారపాక వెంకటయ్య, చంద్రయ్య, ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రమనేశ్వర ఆంజనేయ అయ్యప్ప స్వామి దేవాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం

దిగ్విజయంగా 14వ వారం పూర్తి



ప్రజా వాయిస్ కొండమల్లేపల్లి మండలం అక్టోబర్ 31

కొండమల్లేపల్లి పట్టణంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర ఆంజనేయ అయ్యప్ప స్వామి దేవాలయంలో గత 13 వారాలుగా హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని దిగ్విజయంగా పఠించారు. శనివారంతో 14వ వారం పూర్తి చేశారు .ఈ సందర్భంగా ప్రముఖ పురోహితులు పాల లగణపతి శర్మ ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకం చేసి అలంకరణ చేశారు. అనంతరం ఏడుసార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు. ఈ సందర్భంగా పాలగణపతి శర్మ మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణం ప్రతి ఒక్కరు చేయాలని సూచించారు. హనుమాన్ చాలీసా పారాయణం ప్రతిరోజు చేయడం వలన భూతప్రేత పిశాచాలు దరిచేరవని అంతా శుభమే జరుగుతుందన్నారు. తమ కుటుంబంతో పాటు గ్రామానికి కూడా శుభం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము ,వింజమూరు సత్యనారాయణ ,చారి, నేలంటి వెంకటేశ్వర్లు, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఉప్పల నారాయణ, మల్లికార్జున్, వెంకటేష్, యాదయ్య, రామావత్ చందు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ ఆశయాలే కాంగ్రెస్‌కు బాట

దేశ సమగ్రత, పేదల సంక్షేమానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయం

అనంతగిరిలో ఘనంగా మాజీ ప్రధాని వర్ధంతి కార్యక్రమం

ప్రజా వాయిస్.అనంతగిరి:

భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ వర్ధంతిని అనంతగిరిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొండపల్లి వాసు నివాసం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశ సమగ్రత, సమైక్యత కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశ అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి ఆమె చేసిన కృషి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఇందిరాగాంధీ ఆశయాలను, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు కొండపల్లి వాసు, ఉపాధ్యక్షుడు ధారావత్ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు కనగాల వీరయ్య, మండల ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ కోటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాగీ నరేష్, మాజీ సర్పంచులు ముత్తినేని కోటేశ్వరరావు, గాదె వెంకన్న, సర్పంచులు నందిగామ శ్రీనివాస్, కత్రం జ్ఞానేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు మట్టపల్లి రామకోటయ్య, హటీయా నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాకనాటి రాఘవరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు నాగేంద్రబాబు, బోజియా నాయక్, మురళి, ఏపూరి ముత్యాలరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





బురద దారిలో కార్యలయాలకు పోయేదెలా..?

కరీంనగర్ ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్ళేందుకు ప్రజలకు ఇబ్బందులు

నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే దారి అధ్వాన్నంగా మారిన వైనం

రోడ్డును బాగుచేసి రాకపోకలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు

ప్రజా వాయిస్,కరీంనగర్ (అక్టోబర్ 31):

నూతన కరీంనగర్ కలెక్టరేట్ ప్రాంగణం ప్రక్కనే ఉన్న ఆర్డీవో కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్ళే దారి అస్తవ్యస్తంగా మారింది. గత కొన్ని రోజులుగా ఈ దారి అధ్వాన్నంగా మారి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని నిత్యం ఈ దారి వెంటే ప్రయాణించే అధికారులు గమనించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు అటు ఆర్డీవో కార్యాలయానికి, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలకు తమ పనుల నిమిత్తం వెళ్తుంటారు. ఈ దారి అధ్వాన్నంగా మారడంతో ఒక టూ వీలర్ ఎదురుగా వస్తే మరో టూ వీలర్ ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధాన కార్యాలయాలైన ఆర్డీవో కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లే దారి ఇంత అధ్వాన్నంగా తయారైనప్పటికీ జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు ఈ దారిని బాగు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



శ్రీనివాస్ కుటుంబానికి బీజేపీ నాయకుల పరామర్శ

బాధిత కుటుంబానికి ఎంపీ రఘునందన్‌రావు భరోసా.. ఆర్థిక సాయం అందజేత

గజ్వేల్ మండల శాఖ తరపున అండగా ఉంటామని హామీ

ప్రజా వాయిస్ సిద్ధిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

గజ్వేల్ మండలంలోని బూరుగుపల్లి గ్రామ బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ తల్లి మరణించడంతో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండల శాఖ తరపున బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబానికి అండగా నిలవాలని, కష్టసమయంలో వారికి తోడుగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజరి రాజు, దాతర్‌పల్లి సర్పంచ్ దివ్యరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మన్నె శేఖర్, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, మండల నాయకులు నరేష్‌గౌడ్, మహేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి లో బిజెపిలో కి పలువురు చేరిక..

నూతన బూత్ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక..

బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్..

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సంస్థ గత బలోపేతంలో భాగంగా కేశవపూర్, ఇందిరా నగర్, దండేపల్లి, ఎల్కతుర్తి గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మన్తుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. పలువురు బూత్ లకు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు ఎల్కతుర్తి గ్రామంలో పలువురు నాయకులు కార్యకర్తలు బిజెపిలో చేరారు. ఎల్కతుర్తి గ్రామంలో నూతన బూత్ కమిటీల ఏర్పాటు పలువురి చేరిక. నూతనంగా బూత్ కమిటీలను ఏర్పాటు చేసి మూడు బూత్ లకు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో 314 వ బూత్ అధ్యక్షుడిగా గొడిశాల రాజు, 315 వ బూత్ అధ్యక్షుడిగా అల్లి కిరణ్, 316వ బూత్ అధ్యక్షుడిగా గూడేల్లి దశరథం, అదేవిధంగా అల్లి సురేష్, అల్లి కిరణ్, గూడెల్లి దశరథం, దూడ రమేష్, కందుకూరి శ్రీనివాస్, కడారి

చామన్‌పల్లిలో వైభవంగా జిల్లా స్థాయి అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీలు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి



నిర్మల్ జిల్లా లక్ష్మణచాందా మండలం చామన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్-17 డిస్ట్రిక్ట్ లెవెల్ బాస్కెట్‌బాల్ పోటీలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.ఈ క్రీడా మహోత్సవానికి నియోజకవర్గ, మండల స్థాయి ప్రముఖులు భారీగా తరలివచ్చారు.చామన్‌పల్లి సర్పంచ్ లక్ష్మీ సుదర్శన్, ఉప సర్పంచ్ గంగారెడ్డి, మరియు చింతల్చంద సర్పంచ్ వెంకట్ లు ప్రత్యేక అతిథులుగా విచ్చేసి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడుతాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి శ్రీకాంతరెడ్డి, నిర్మల్ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణచాందా మండల విద్యాధికారి రాజు నాయక్, డీటీ బాబులాల్, ఎంపీఓ నసీరుద్దీన్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మణ్ రాథోడ్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

ఘనంగా ఏర్పాట్లు -జోనల్స్‌కు ఎంపిక

కార్యక్రమంలో చామన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి గంగాధర్, అసోసియేషన్ అధ్యక్షుడు అంబాజీ, సత్తయ్య, టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏ. మజీద్, పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన పీడీలు పీఈటీలు పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.ఈ క్రీడా పోటీల నిర్వాహకులు బండి డేవిడ్ బెన్హర్ మాట్లాడుతూ.జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సెలక్షన్ కాబడిన క్రీడాకారులు తదుపరి నిర్వహించే జోనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో నిర్మల్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని స్పష్టం చేశారు.

పాఠశాలకు వెళ్లి.. తిరిగి రాని బాలుడు.!

మూడు రోజులుగా ఆచూకీ లేని 14 ఏళ్ల విద్యార్థి..

ఆందోళనలో తల్లిదండ్రులు

మధ్యాహ్న విరామ సమయంలో పాఠశాల నుంచి వెళ్లిపోయిన వరుణ్ సందేశ్

కనిపిస్తే సమాచారం ఇవ్వాలని తండ్రి వేడుకోలు

ప్రజా వాయిస్, హాలియా:



పాఠశాలకు వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి చేరకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. హాలియా మున్సిపాలిటీలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జటావత్ వరుణ్ సందేశ్ (14) ఈ నెల 29న మధ్యాహ్న విరామ సమయంలో ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.జానారెడ్డి కాలనీకి చెందిన వరుణ్ తండ్రి తారాసింగ్ తన కుమారుడి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ఎక్కడైనా బాలుడు కనిపిస్తే పాఠశాల యాజమాన్యానికి, హాలియా పోలీసులకు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని కోరారు.సమాచారం ఇవ్వాల్సిన నంబర్లు:6302296182, 9959052812.



మాజీ సీఎం కేసీఆర్‌పై నూతన పాట విడుదల

- బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

- జొన్నోజి నాగులు రచించిన కెసిఆర్ కొత్త పాట విడుదల చేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రజా వాయిస్, దౌల్తాబాద్:

బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలోని జీఎల్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలై బలై' వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ భవిష్యత్ కార్యాచరణను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రత్యేక పాట విడుదల:

ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా బాపు కేసీఆర్‌పై రూపొందించిన నూతన పాటను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విడుదల చేశారు. జొన్నోజి క్రియేషన్స్ ఆధ్వర్యంలో జొన్నోజి నాగులు రచించిన ఈ పాటను ఆవిష్కరించడం కార్యక్రమంలో విశేషంగా నిలిచింది. కేసీఆర్‌పై రూపొందించిన ఈ పాట విడుదలతో కార్యక్రమంలో సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో రామారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మారగోని మహేష్ గౌడ్, వంజరి సురేష్, సిలివేరి స్వామి, జొన్నోజి నాగులు, మారగోని ప్రసాద్ గౌడ్, వార్డు సభ్యుడు వంజరి విజయ్ కుమార్, వంజరి మహేష్, సిద్ధిరాములు కుమార్, పెరుమని నవీన్, బంజరుపల్లి బిక్షపతి, రెడ్డిబోయిన బాలరాజు, మంగలి రాజు, నల్ల యాదగిరి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి

ప్రజా వాయిస్, మోత్కూరు (అక్టోబర్ 31):



మోత్కూరు రైతు సేవ సహకార సంఘం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఓబీసీ మోర్చా జనగాం జిల్లా ఇన్చార్జి పోచం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.వరి కోతలు ప్రారంభమై 20 రోజులైనా ఇంతవరకు ఐకెపి ధాన్యం కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతాంగం ధాన్యం ను ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్మడం వల్ల తరుగు,తేమ వివిధ కారణాలతో కటింగులు పెడుతూ రెండు శాతం కమిషన్ తీసుకుంటూ రైతులకు15 రోజుల తర్వాత డబ్బులు చెల్లిస్తామని చెప్పడం రైతాంగాన్ని మోసం చేయడమేనని ఆరోపించారు.తుఫాను కారణంగా రైతులు ముందు జాగ్రత్త తో వరి కోతలు ముందుగా కోసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేక ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్మడం వల్ల మద్దతు ధర కూడా దక్కకుండా అతి తక్కువ ధరకు పంటను అమ్మి నష్టపోతున్నారనిఆయన ఆవేదన వ్యక్తం చేశారు రైతాంగాన్ని ఆదుకోవడానికి వెంటనే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.



మోత్కూరు లో బస్సు డిపో ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని ఎమ్మార్వో కు వినతి

ప్రజా వాయిస్, మోత్కూరు, (అక్టోబర్ 31)

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బస్సు డిపో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శనివారం ఆర్టీసీ బస్సు డిపో సాధన సమితి సభ్యులు తాసిల్దార్ జ్యోతి కి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎర్రవెల్లి నర్సయ్య,కలిమెల నర్సయ్య,చింత గణేష్, బుర్ర శ్రీనివాస్, చంద్రమౌళి, బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.



అల్ఫోర్స్ ఇ-టెక్నో లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన వేడుకలు..

ప్రజా వాయిస్, కరీంనగర్ (అక్టోబర్ 31):



భారతదేశ మొదటి ఉపప్రధానమంత్రి మరియు హోంమంత్రి అయిన స్వాతంత్ర సమరయోధుడు రాజనీతిజ్ఞుడైన సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ జన్మదినాన్ని పురస్కరించుకొని "అల్ఫోర్స్" ఇ-టెక్నో పాఠశాలలో జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా, వి. నరేందర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా విచ్చేసి వల్లభాయ్ పటేల్ చిత్రపటాన్ని పూలతో అలంకరించి జన్మదిన వేడుకలు ప్రారంభించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కుమనిషిగా పేరుగాంచిన వల్లభాయ్ పటేల్ సేవలు అత్యంత ప్రశంసనీయమన్నారు. వల్లభాయ్ పటేల్ ఎన్నో ఉద్యమాలను విజయవంతంగా నడిపారు. ఆయన చేసిన సేవలకు గాను 1991 లో భారత ప్రభుత్వం అతని మరణానంతరం భారతరత్న తో సత్కరించింది. వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకోబడుతుందన్నారూ. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.